తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి : 02 సంచిక 340 హైదరాబాద్ : సంపాదకులు : గున్నాల అనిల్‌రెడ్డి మంగళవారం 27-5-2025 పేజీలు : 12 వేల : 5

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..
తెలుగు-వెలుగు
మీకో చక్కని వేదికగా నిలుస్తోంది.
ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని
చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
97050 43131 8096660656

## ఉగ్రవాదం అంతానికి పాక్ ప్రజలు
# ముందుకు రావాలి

**లేదంటే మా సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదు.. ఉగ్ర దాడి జరిగితే మోదీ మౌనంగా ఉంటాడా?**

**మా చెల్లెళ్ల బొట్టు చెరిపేవారిని అంతమొందించి తీరతాం: మోదీ**



**దాహోద్/భుజ్, మే 26:** ఉగ్రవాదం అంతానికి పాక్ ప్రజలు ముందుకు రావాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. వారి ప్రభుత్వం, ఆర్మీ తమ స్వార్థం కోసమే టెర్రరిజానికి మద్దతిస్తున్నాయని తెలిపారు. శాంతిమార్గం ఎంచుకోకపోతే వారు భారత సైన్యం ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పేదరిక నిర్మూలన, ఆర్థికాభివృద్ధిలో భారత్ ముందంజలో ఉంటే.. దానిపై విద్వేషం పెంచడం.. కీడు చేయడమే పాకిస్థాన్ ఏకైక లక్ష్యంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. పహల్గాంలో అమాయక టెర్రరిస్టులపై ఉగ్రవాదులు దాడిచేస్తే ఇండియా, మోదీ మౌనంగా ఎలా కూర్చుంటారని ప్రశ్నించారు. మన అక్కచెల్లెళ్ల నుదుట బొట్టు చెరిపే సాహసం ఎవరు చేసినా వారిని అంతం చేసి తీరతామని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం గుజరాత్ వచ్చిన ఆయన తొలిరోజు సోమవారం వడోదరాలో భారీ రోడ్‌షో నిర్వహించారు. కల్నల్ సోఫియా ఖురేషీ కుటుంబ సభ్యులు కూడా దీనికి హాజరయ్యారు. అనంతరం దాహోద్, భుజ్‌లో జరిగిన బహిరంగ సభల్లో ప్రధాని మాట్లాడారు. టెర్రరిజాన్ని పాక్ టూరిజంగా భావిస్తోందన్నారు. ఇది ప్రపంచానికే ప్రమాదమని చెప్పారు. 'పాక్ ప్రజలను ఒకటి అడుగదలచుకున్నాను. ఇన్నేళ్లలో మీరు ఏం సాధించారు? ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినవారు మీ జీవితాలను నాశనం చేశారు. ఉగ్రవాదం మీ ప్రభుత్వానికి, సైన్యానికి సంపాదన మార్గం. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి మీరే ముందుకు రావాలి' అన్నారు. ఇదిలా ఉండగా, భారతీయ పండుగల సందర్భంగా విదేశాల్లో తయారైన టపాసులు, గణేశ ప్రతిమలు కొనడంపై ప్రధాని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి దిగుమతి వస్తువులను కొనడం ఆపాలని మీరు యోచించరా అని ప్రజలను ప్రశ్నించారు. దేశ ప్రగతి కోసం దేశీయంగా తయారయ్యేవాటినే కొంటామని అందరూ సంకల్పం తీసుకోవాలని పిలుపిచ్చారు. దాహోసలో రూ. 24 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.

**మహిళా సాధికారతకు మోదీ ఎంతో చేశారు: సోఫియా సోదరి**

ఎయిర్‌పోర్టు నుంచి వైమానిక దళ కేంద్రం వరకు కిలోమీటరు వరకు మోదీ రోడ్‌షో సాగింది. కల్నల్ సోఫియా ఖురేషీ స్వస్థలం వడోదరా అన్న సంగతి తెలిసిందే. రోడ్‌షోకు ఆమె తల్లిదండ్రులు, కవల సోదరి షైనా ఖురేషీ, సోదరుడు మొహమ్మద్ సంజయ్ ఖురేషీ కూడా హాజరయ్యారు. షైనా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానిని కలవడం సంతోషంగా ఉందన్నారు. మహిళల సాధికారతకు ఆయన ఎంతో చేశారని కొనియాడారు.

**దేశంలో తొలి 'బాహుబలి' విద్యుత్ ఇంజన్‌కు పచ్చజెండా**

సీమెన్స్ కంపెనీ నిర్మించిన దేశంలోనే అత్యంత శక్తివంతమైన 9000 హార్స్‌పవర్ విద్యుత్ రైలు ఇంజన్‌ను మోదీ సోమవారం ప్రారంభించారు. దేశంలో రైల్వే ద్వారా వస్తు రవాణాను ప్రస్తుతం ఉన్న 27% నుంచి 45 శాతానికి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాకారం చేయడంలో ఇది కీలకంగా నిలుస్తుంది. దేశంలో ఇంత భారీ సామర్థ్యం గల విద్యుత్ లోకోమోటివ్‌ను తయారుచేయడం ఇదే ప్రథమం. రైల్వే శాఖ నుంచి ఇలాంటి 1200 లోకోమోటివ్‌ల డిజైన్, తయారీ, నిర్వహణకు సంబంధించి లభించిన ఆర్డర్‌కు అనుగుణంగా దహోద్‌లోని ఫ్యాక్టరీలో సీమెన్స్ దీన్ని నిర్మించింది. గంటకి 120 కిలోమీటర్ల వేగంతో 5800 టన్నుల బరువును సునాయాసంగా తరలించగల సామర్థ్యం ఈ ఇంజన్‌కు ఉంది.

# రాయబారం..విఫలం!
## కవితతో ఫలించని కేసీఆర్ దూతల చర్చలు

కేసీఆర్ ఆదేశాలతో కవిత నివాసానికి దామోదరరావు, గండ్ర మోహనరావు

3 గంటలపాటు కొనసాగిన చర్చలు

పార్టీకి, కుటుంబానికి నష్టమంటూ వివరణ

ఫోన్లో మాట్లాడిన కేసీఆర్ తొందరపడొద్దని కుమార్తెకు సూచన

పార్టీలో తన పరిస్థితి ఏమిటో ఇప్పుడే స్పష్టం చేయాలని పట్టుబట్టిన కవిత

లేకపోతే తన దారి చూసుకుంటానని వెల్లడి



**హైదరాబాద్, మే 26:** ఎమ్మెల్సీ కవితతో బీఆర్ఎస్ పార్టీ అధినాయకత్వం జరిపిన రాయబారం విఫలమైందా!? వరుసగా రెండు సార్లు రాయబార ప్రయత్నాలు చేసినా.. ఆమె ఏమాత్రం మెత్తబడలేదా!? పార్టీలో తన ప్రాధాన్యం.. పార్టీ అధికారంలోకి వస్తే తన పరిస్థితిపై ఇప్పుడే స్పష్టత ఇవ్వాలని పట్టుబట్టారా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. పార్టీలో తన పరిస్థితిపై ముందే స్పష్టత ఇవ్వాలని, లేకపోతే తన దారి తాను చూసుకుంటానని కాస్త ఘాటుగానే స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో కేసీఆర్‌కు కవిత లేఖ రాయడం, ఆమె అమెరికాలో ఉన్నప్పుడు అది బహిర్గతం కావడం.. దానిని తానే రాశానని స్పష్టం చేసిన కవిత.. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలే దానిని లీకు చేశాయని తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ఆదివారం కేటీఆర్‌ను పిలిపించుకుని కేసీఆర్ సంప్రదింపులు జరిపారు. కవిత వ్యవహారాన్ని ఓ కొలిక్కి తీసుకురాకుంటే మరింత నష్టం తప్పదన్న భావనకు వచ్చి.. సోమవారం ఆమె వద్దకు రాయబారం పంపారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో పార్టీ దూతలు కవిత నివాసానికి వచ్చారు. తొలుత, కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడు, బీఆర్ఎస్ ఎంపీ దివికొండ దామోదర రావు సోమవారం మధ్యాహ్నం కవిత నివాసానికి చేరుకున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు సంప్రదింపులకు వచ్చానని ఆయన కవితకు స్పష్టం చేసినట్లు జాగృతి వర్గాలు తెలిపాయి. కొంతసేపు చర్చించిన తర్వాత ఆయన వెళ్లిపోయారు. అనంతరం, పార్టీ లీగల్ సెల్ బాధ్యతలు చూసే గండ్ర మోహన్‌రావు కవిత నివాసానికి చేరుకున్నారు. ఆయన కూడా కొంతసేపు మాట్లాడి.. వెళ్లిపోయారు. కేసీఆర్ పంపిన ఇద్దరు దూతలూ ఒకరి తర్వాత మరొకరు కవితతో మాట్లాడారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు దాదాపు మూడు గంటలపాటు ఈ సంప్రదింపుల ప్రక్రియ నడిచినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. దివికొండ దామోదర రావు, గండ్ర మోహనరావు ఇద్దరికీ కూడా కేసీఆర్ కుటుంబంతో బంధుత్వం ఉన్నట్లు పార్టీలోని సీనియర్ నేతలు చెబుతున్నారు. అందుకే వారిని సంప్రదింపుల కోసం పంపినట్లు సమాచారం.

## రైతు సంక్షేమానికే కొత్త విత్తన చట్టం

**రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి**

**హైదరాబాద్, మే 26:** రైతుల సంక్షేమం కోసమే కొత్త విత్తన చట్టం తీసుకొస్తున్నట్లు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. విత్తన చట్ట ముసాయిదా రూపకల్పనకు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, విత్తనాల తయారీ సంస్థలు, ఆర్గనైజర్లు, డీలర్లతో సంప్రదించి, వారి అభిప్రాయాలను సేకరిస్తామని చెప్పారు.

# ముంబయిలో భారీ వర్షాలు..
## 107 ఏళ్ల నాటి రికార్డు బ్రేక్..!

ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో వర్షాలు దంచికొడుతున్నాయి. గత 75 సంవత్సరాల్లో



ఎన్నడూలేని విధంగా నైరుతి రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశించాయి. ఈ క్రమంలో భారీ వర్షం కురిసింది. ఫలితంగా 107 సంవత్సరాల రికార్డు బద్దలయ్యింది. మే మాసంలో 107 సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో భారీ వర్షం కురిసింది. ముంబయికి నైరుతి రుతుపవనాలు చేరాయని వాతావరణశాఖ తెలిపింది. సాధారణంగా జూన్ 11 వరకు వస్తుండగా.. ఈ సారి మాత్రం 16 రోజుల ముందుగానే వచ్చాయని తెలిపింది. భారత వాతావరణ శాఖ (%×వీణ%) శాస్త్రవేత్త సుష్మా నాయర్ మాట్లాడుతూ.. గతంలో నైరుతి రుతుపవనాలు తొలిసారిగా 1956 మే 29న ముంబయికి ముందస్తుగా చేరాయని.. ఆ తర్వాత 1962, 1971లో అదే రోజుల్లో వచ్చినట్లుగా పేర్కొంది. రుతుపవనాల ఆగమనంతో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల మధ్య కొలాబాలో 105.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత శాంటాక్రూజ్ (55 మిల్లీమీటర్లు), బాంద్రా 68.5, జుహు విమానాశ్రయం 63.5, చెంబూర్ 38.5, విఖ్రోలి 37.5 , మహాలక్ష్మి 33.5, సియోన్ 53.5లో మిల్లీమీటర్ల వర్షాపాతం రికార్డయినట్లు వాతావరణశాఖ తెలిపింది. జడివాన కారణంగా ముంబయిలోని అనేక లోతట్టు ప్రాంతాలతో పాటు రైల్వే ట్రాక్‌లు నీటితో నిండిపోయాయి. దాంతో ఉదయం రోడ్లు, స్థానిక రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. బలమైన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో ముంబయిలో కొన్ని గంటల పాటు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. సెంట్రల్ రైల్వే నెట్‌వర్క్‌లోని మసీదు, బైకుల్లా, దాదర్, మాటుంగా, బద్లాపూర్ రైల్వే స్టేషన్లలో భారీ వర్షాల కారణంగా ట్రాక్‌లు నీట మునిగాయి.

## ఫార్ములా-ఈ రేసు కేసులో
# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసు..

**రేపు విచారణకు రావాలని ఆదేశం**

**ముందే నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం విదేశాలకు వెళ్తున్నా**

**తిరిగి వచ్చిన తర్వాత హాజరవుతా: ఏసీబీకి కేటీఆర్ సమాధానం**

**'నేషనల్ హెరాల్డ్'లో రేవంత్ పాత్రపై బీజేపీ నేతలు మాట్లాడడం లేదేమని నిలదీత**



**హైదరాబాద్, మే 26:** ఫార్ములా-ఈ కారు రేసు కేసులో మరో కీలక పరిణామం. ఈ కేసులో అవినీతి, అవకతవకలకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అప్పటి మునిసిపల్, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 28న (బుధవారం) తమ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా-ఈ కారు రేసు నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ రేసు నిర్వహణలో అక్రమాలు జరిగాయని, ప్రభుత్వ ఖజానాకు రూ. 54.88 కోట్ల నష్టం జరిగిందని, దీనిపై దర్యాప్తు జరపాలంటూ గత ఏడాది అక్టోబరు 18వ తేదీన మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. అప్పట్లో క్యాబినెట్, ఆర్థిక శాఖ ఆమోదం తీసుకోకుండానే ఫార్ములా-ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో)కు హెచ్ఎండీఏ ఈ చెల్లింపులు చేసిందని పేర్కొన్నారు. ఈ రేసు నిర్వహణకు, హెచ్ఎండీఏకు ఎటువంటి సంబంధం లేదని కూడా తెలిపారు. ఈ నేపథ్యంలోనే, కేసు నమోదు చేసిన ఏసీబీ.. దర్యాప్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఒకసారి కేటీఆర్‌ను ఏసీబీ ప్రత్యేక బృందం సుదీర్ఘంగా విచారించింది. అవసరమైతే మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని గత విచారణ ముగింపు సమయంలోనే చెప్పి పంపింది. ఈ కేసుకు సంబంధించి విదేశాల్లో ఉన్న సంస్థ ప్రతినిధుల్ని సైతం ఆన్‌లైన్‌లో ఏసీబీ అధికారులు విచారించారు. దర్యాప్తునకు అవసరమైన పత్రాలు పంపాలని కోరుతూ పలు దఫాలుగా మెయిల్స్ పంపారు. ఇదే కేసుకు సంబంధించి అప్పటి మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి తదితరులనూ ఏసీబీ విచారించింది. ఈ కేసులో పలువురిని విచారించిన దర్యాప్తు అధికారులు.. వారి నుంచి వచ్చిన సమాచారం, దర్యాప్తులో సేకరించిన పత్రాల ఆధారంగా మరోసారి కేటీఆర్‌ను విచారించేందుకు సిద్ధమయ్యారు. కాగా, ఈ కేసులో భాగంగా విదేశాలకు నిధులు దారిమళ్లడంతో ఈడీ కూడా దర్యాప్తు జరుపుతోంది.

**విదేశీ పర్యటన తర్వాత వస్తా..**

ఏసీబీ నోటీసులపై కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఫార్ములా ఈ కారు రేసు కేసులో 28న విచారణకు రావాలని ఏసీబీ నోటీసలు జారీ చేసింది. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోసమే పెట్టినా.. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా కచ్చితంగా దర్యాప్తు సంస్థకు సహకరిస్తాను. అయితే, ముందుగా నిర్ణయించిన షెడ్యూలు మేరకు యూకే, అమెరికాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్నాను. తిరిగి వచ్చిన వెంటనే దర్యాప్తు సంస్థ ఎదుట విచారణకు హాజరవుతాను. ఇదే విషయాన్ని ఏసీబీ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాను" అని పోస్ట్ చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో 48 గంటల క్రితమే రేవంత్ రెడ్డి పేరు వచ్చిందని, 24 గంటల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీ అగ్రనాయకులతో, ప్రధాని మోదీతో సన్నిహితంగా కనిపించారని, డబ్బు అక్రమ రవాణా కేసులో ఆయన ప్రమేయంపై ఒక్క బీజేపీ నాయకుడు కూడా మాట్లాడలేదని ఆయన ఆరోపించారు.



## జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానం

**రిజిస్ట్రేషన్లకు 'ఆధార్-ఈ' సంతకం అమల్లోకి**

**ప్రయోగాత్మకంగా కూసుమంచి, ఆర్మూర్‌లో: పొంగులేటి**

**హైదరాబాద్, మే 26:** రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానాన్ని జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకొస్తున్నట్లు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా ఆధార్-ఇ సంతకం అమల్లోకి తీసుకొస్తున్నామని చెప్పారు. తొలుత ప్రయోగాత్మకంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దీన్ని అమల్లోకి తెచ్చామని వివరించారు.సచివాలయంలో ఉన్నతాధికారులతో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అవినీతికి దూరంగా ఉంటూ.. ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించాలనిఅన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠను పెంచేలా సబ్ రిజిస్ట్రార్ల పని తీరు ఉండాలని సూచించారు

# పుతిన్‌కు పిచ్చి పిచ్చిపట్టింది, జెలెన్‌స్కీ నోరు మూసుకుంటే మంచిది

- డొనాల్డ్ ట్రంప్ ఘాటు వ్యాఖ్యలు
- తాను అధ్యక్షుడిగా ఉంటే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యేదే కాదన్న ట్రంప్
- పుతిన్‌కు పూర్తిగా మతిస్థిమితం తప్పిందని, అనవసరంగా జనాన్ని చంపుతున్నారని ఆరోపణ
- జెలెన్‌స్కీ నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలు తెస్తోందని విమర్శ
- ఉక్రెయిన్‌పై రష్యా దాడుల్లో చిన్నారులు సహా పౌరుల మృతి
- ఈ యుద్ధానికి బైడెన్, పుతిన్, జెలెన్‌స్కీలే కారణమన్న ట్రంప్




రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ఇద్దరినీ లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. తాను అధికారంలో ఉండి ఉంటే ఈ యుద్ధం అసలు మొదలయ్యేదే కాదని స్పష్టం చేశారు. వారాంతంలో ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన భారీ వైమానిక దాడుల్లో చిన్నారులతో సహా పలువురు పౌరులు మరణించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' లో ట్రంప్ స్పందిస్తూ.. ఒకప్పుడు పుతిన్‌తో తనకు మంచి సంబంధాలు ఉండేవని, కానీ ఇప్పుడు ఆయనకు "పూర్తిగా పిచ్చిపట్టింది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. "రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నాకు ఎప్పుడూ మంచి సంబంధాలే ఉండేవి. కానీ ఆయనకు ఏదో అయింది. ఆయనకు పూర్తిగా మతి స్థిమితం తప్పింది! సైనికులనే కాదు, అనవసరంగా చాలా మందిని చంపేస్తున్నారు. ఉక్రెయిన్‌లోని నగరాలపైకి ఎలాంటి కారణం లేకుండానే క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నారు" అని ట్రంప్ రాసుకొచ్చారు. అంతేకాకుండా, "పుతిన్ ఉక్రెయిన్‌లో కొంత భాగాన్ని కాదు, మొత్తం ఉక్రెయిన్‌ను కోరుకుంటున్నారని నేను ఎప్పుడూ చెబుతూనే ఉన్నాను. బహుశా అదే నిజమని ఇప్పుడు రుజువవుతోంది. కానీ ఆయన అలా చేస్తే, అది రష్యా పతనానికి దారితీస్తుంది!" అని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా మౌనం పుతిన్‌కు ధైర్యాన్నిస్తోం దంటూ ఇటీవల జెలెన్‌స్కీ చేసిన ఆరోప ణలకు కూడా ట్రంప్ బదులిచ్చారు. జెలెన్‌స్కీ మాటతీరును తప్పుబడుతూ "అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఇలా మాట్లాడటం ద్వారా తన దేశానికి ఎలాంటి మేలు చేయడం లేదు. ఆయన నోటి నుంచి వచ్చే ప్రతి మాటా సమస్యలను సృష్టిస్తోంది. నాకది నచ్చడం లేదు, ఇకనైనా ఇది ఆగాలి. నేను అధ్యక డిగా ఉంటే ఈ యుద్ధం ఎప్పటికీ మొదలయ్యేది కాదు" అని ట్రంప్ స్పష్టం చేశారు.రష్యా వైమానిక దాడులపై ఆదివారం సాయంత్రం వరకు మౌనంగా ఉన్న ట్రంప్.. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ పుతిన్‌పై విమర్శలు చేశారు. "ఆయన చాలా మందిని చంపుతున్నారు. ఆయనకేమైందో నాకు అర్థం కావడం లేదు. అసలు ఆయనకు ఏమైంది? చాలా మంది ప్రాణాలు తీస్తున్నారు. ఈ విషయం నాకు సంతోషాన్నివ్వడం లేదు" అని పుతిన్‌ను ఉద్దేశించి ట్రంప్ అన్నారు.ఈ వివాదం నుంచి తనను తాను దూరం చేసుకునే ప్రయత్నం చేసిన ట్రంప్ ఈ యుద్ధానికి జెలెన్‌స్కీ, పుతిన్, తన తర్వాత అధ్యక్షుడైన జో బైడెన్‌లే బాధ్యులని పునరుద్ఘాటించారు. "ఇది జెలెన్‌స్కీ, పుతిన్, బైడెన్‌ల యుద్ధం.. 'ట్రంప్' యుద్ధం కాదు. తీవ్ర అసమర్థత, విద్వేషం వల్ల మొదలైన ఈ భయంకరమైన మంటలను ఆర్పడానికి మాత్రమే నేను సహాయం చేస్తున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు .ఫిబ్రవరి 2022లో పూర్తిస్థాయి యుద్ధం మొదలైన ప్పటి నుంచి ఇరు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ఖైదీల మార్పిడి (ఇరువైపులా సుమారు 1,000 మంది ఖైదీల విడుదల) జరిగిన కొద్ది రోజులకే రష్యా ఈ దాడులకు పాల్పడింది. వాయవ్య జైటోమిర్ ప్రాంతంలో జరిగిన తాజా దాడుల్లో ఎనిమిది, పన్నెండేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులతో పాటు 17 ఏళ్ల టీనేజర్ మరణించినట్లు ఉక్రెయిన్ అధికారులు ధ్రువీకరించారు.ఇటీవలి హింసాత్మక ఘటనల నేపథ్యంలో రష్యాపై మరింత కఠినమైన ఆంక్షలు విధించే అంశాన్ని తాను పరిశీలిస్తున్నట్టు కూడా ట్రంప్ సూచించారు. అయితే, ఈ విషయంలో ట్రంప్ వైఖరి, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కాంగ్రెస్‌కు ఈ వారం మొదట్లో వెల్లడించిన దానికి భిన్నంగా ఉన్నట్టు తెలుస్తోంది. చర్చలకు రష్యాను నిరుత్సాహపరిచే అవకాశం ఉన్నందున, ఈ సమయంలో ఆంక్షలు విధిస్తామని బెదిరించడం సరికాదని ట్రంప్ భావిస్తున్నట్టు రూబియో చెప్పారని సమాచారం.

# పాక్ ఎయిర్‌బేస్‌పై భారత దెబ్బ

**శాటిలైట్ చిత్రాల్లో స్పష్టమైన విధ్వంసం! - పాకిస్థాన్ మురిద్ ఎయిర్‌బేస్‌పై భారత వైమానిక దళం దాడులు**

**శాటిలైట్ చిత్రాల్లో బయటపడిన నష్టం - కమాండ్ అండ్ కంట్రోల్ భవనం దెబ్బతిన్నట్టు వెల్లడి**

**ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దాడులు**




భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' లో భాగంగా పాకిస్థాన్‌లోని మురిద్ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో గణనీయమైన నష్టం వాటిల్లినట్టు తాజా ఉపగ్రహ చిత్రాల ద్వారా వెల్లడైంది. మే 23న తీసిన ఈ చిత్రాలను 'ది ఇంటెల్ ల్యాబ్'కు చెందిన జియో–ఇంటెలిజెన్స్ పరిశోధకుడు డామియన్ సైమన్ పంచుకున్నారు.ఈ చిత్రాల ప్రకారం.. భారత వైమానిక దళం జరిపిన కచ్చితమైన దాడిలో మురిద్ ఎయిర్‌బేస్‌లోని ఒక కీలకమైన కమాండ్ అండ్ కంట్రోల్ భవనం దెబ్బతిన్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. "ఈ దాడి వల్ల భవనం పైకప్పులోని ఒక భాగం కూలిపోయింది, దీనివల్ల భవనం లోపల కూడా నష్టం జరిగి ఉండే అవకాశం ఉంది" అని డామియన్ సైమన్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది అమాయక పౌరుల మృతికి కారణమైన దారుణమైన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా మే 7న 'ఆపరేషన్ సిందూర్'ను భారత్ ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత దళాలు కచ్చితమైన దాడులు నిర్వహించాయి .అంతకు ముందు, అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి భారత నగరాలపై పాకిస్థాన్ రెచ్చగొట్టే దాడులకు పాల్పడటంతో ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు తీవ్ర స్థాయిలో కాల్పులు చోటుచేసుకున్నాయి. మే 12న కాల్పుల విరమణకు ఇరుపక్షాలు అంగీకరించినప్పటికీ, కొద్ది గంటల్లోనే పాకిస్థాన్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించింది.'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా భారత సాయుధ దళాలు పంజాబ్‌లోని రఫీకి, మురిద్, నూర్ ఖాన్, చునియన్‌తో పాటు సుక్కూర్‌లోని పాకిస్థాన్ వైమానిక స్థావరాలను కూడా లక్ష్యంగా చేసుకున్నట్టు సమాచారం. మురిద్ వైమానిక స్థావరం, భారత్‌తో సరిహద్దు ప్రాంతంలో పాకిస్థాన్ వైమానిక దళం కార్యాచరణ సంసిద్ధతకు అత్యంత కీలకమైనది. ఇక్కడ అనేక అత్యాధునిక ఫైటర్ జెట్‌లు, డ్రోన్‌లు మోహరించి ఉన్నాయి.ఈ స్థావరంలో పాకిస్థాన్‌కు చెందిన షాపర్ 1, షాపర్ 2, బుర్రాక్, ఫాల్కో, బేరక్‌తార్ టీబీ2ఎస్, బేరక్‌తార్ అకింజీ, సీహెచ్–4, వింగ్ లూంగ్ 2 వంటి అత్యాధునిక డ్రోన్‌లు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ దాడి పాకిస్థాన్ సైనిక సామర్థ్యానికి గట్టి దెబ్బ అని విశ్లేషకులు భావిస్తున్నారు.

# యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు పాక్‌లో రాచమర్యాదలు

**ఆరుగురు గన్ మెన్లతో సెక్యూరిటీ.. - లాహోర్‌లో ఏకే-47 గన్‌మెన్లతో ఆమెకు సెక్యూరిటీ కల్పించడంపై స్కాటిష్ యూట్యూబర్ ఆశ్చర్యం**

**పాక్ గూఢచర్యం కేసులో అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా - స్కాటిష్ యూట్యూబర్ కాలమ్ మిల్ వీడియోలో రికార్డయిన ఘటన**

**ఆమె విలాసవంతమైన జీవనశైలి, ఆర్థిక లావాదేవీలపై పోలీసుల దర్యాప్తు ముమ్మరం**




పాకిస్థాన్‌కు గూఢచర్యం చేసిందన్న ఆరోపణలతో అరెస్టయిన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు సంబంధించి మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ పర్యటనలో ఆమెకు రాచమ ర్యాదలు జరిగినట్లు తెలుస్తోంది. లాహోర్ లోని అనార్కలీ బజార్ సందర్శించిన సమయంలో జ్యోతి మల్హోత్రాకు ఏకంగా ఆరుగురు గన్ మెన్లు ఏకే 47 లతో భద్రత కల్పించిన విషయం బయటపడింది. స్కాట్లాండ్ కు చెందిన ఓ యూట్యూబర్ వీడియోలో జ్యోతి మల్హోత్రా గన్ మెన్ల భద్రత మధ్య వీడియోలు తీసుకోవడం కనిపించింది. జ్యోతి మల్హోత్రాకు కల్పించిన సెక్యూరిటీపై స్కాట్లాండ్ యూట్యూబర్ ఆశ్చర్యపోయారు. వివరాల్లోకి వెళితే.. "కాలమ్ అబ్రాడ్" అనే యూట్యూబర్ స్కాటిష్ పౌరుడు కాలమ్ మిల్ గత మార్చి నెలలో పాకిస్థాన్‌లో పర్యటించారు. లాహోర్‌లోని ప్రసిద్ధ అనార్కలీ బజార్‌లో ఆయన తిరుగుతుండగా, కొందరు వ్యక్తులు తుపాకులతో కనిపించారు. వారి చొక్కాలపై "నో ఫియర్" అని రాసి ఉంది. వారితో పాటు జ్యోతి మల్హోత్రా కూడా వీడియో రికార్డ్ చేస్తూ కనిపించింది. కాలమ్ మిల్ తనను తాను పరిచయం చేసుకుని, పాకిస్థాన్‌కు రావడం ఇది ఐదోసారని చెప్పింది. జ్యోతి తాను భారతీయురాలినని పరిచయం చేసుకుంది. పాక్ ఆతిథ్యం గురించి కాలమ్ అడగగా "చాలా బాగుంది" అని జ్యోతి బదులి చ్చింది.జ్యోతి మల్హోత్రా ముందుకు వెళ్తున్నప్పుడు, ఆ సాయుధ వ్యక్తులు ఆమెతోనే ఉన్నారని కాలమ్ మిల్ గుర్తించారు. "ఆమె చుట్టూ ఆరుగురు గన్‌మెన్లు ఉన్నారు. అన్ని తుపాకులు ఎందుకు? అంత భద్రత అవసరమేంటి?" అని ఆయన తన వీడియోలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలమ్ మిల్ ఒంటరిగా తిరుగుతుంటే, జ్యోతి మల్హోత్రాకు ఇంత భారీ భద్రత ఎందుకన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఆ సాయుధులు యూనిఫాంలో లేనప్పటికీ మఫ్టీలో ఉన్న భద్రతా సిబ్బంది అయి ఉండొచ్చని భావిస్తున్నారు.ఈ వీడియోతో జ్యోతి మల్హోత్రాకు పాకిస్థాన్ లో ఏ స్థాయి వ్యక్తులతో పరిచయాలు ఉన్నాయనేది తెలుస్తోంది. ఆమె పాక్‌లో ఉన్నతస్థాయి పార్టీలకు హాజరై, అక్కడి భద్రత, నిఘా అధికారులను కలిసినట్లు తెలుస్తోంది. భారత్‌కు తిరిగివచ్చాక కూడా వారితో టచ్‌లో ఉన్నట్లు పోలీసుల విచారణలో ఆమె చెప్పినట్లు సమాచారం. అధికారులు ఆమె డిజిటల్ పరికరాలను పరిశీలిస్తున్నారు.జ్యోతి ఆర్థిక లావాదేవీలపైనా పోలీసులు దృష్టి సారించారు. ఆమె ఆదాయానికి మించి విలాసవంతమైన జీవితం గడిపినట్లు గుర్తించారు. విమానాల్లో ఎప్పుడూ ఫస్ట్ క్లాస్‌లోనే ప్రయాణించడం, ఖరీదైన హోటళ్లలో బస చేయడం వంటివి చేసినట్లు తేలింది. ఆమె పాకిస్థాన్ పర్యటన "స్పాన్సర్డ్ ట్రిప్" అయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పాకిస్థాన్ నుంచి వీఐపీ ఆతిథ్యం పొంది తిరిగివచ్చిన వెంటనే జ్యోతి చైనాకు వెళ్లారు. అక్కడ కూడా విలాసవంతమైన కార్లలో తిరుగుతూ, ఖరీదైన నగల దుకాణాలను సందర్శించినట్లు సమాచారం.

## మిస్ ఇండియా వివాదంపై విచారణ

హైదరాబాద్:మే 26



తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ వేదికగా 72వ ప్రతిష్ఠాత్మక మిస్ వరల్డ్ పోటీలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన బ్రిటన్‌కు చెందిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ అనూహ్యంగా ఈ పోటీల నుంచి వైదొలిగి ఈ నెల 16న తిరిగి వెళ్లినట్టు తెలుస్తోంది. అయితే తొలుత తన వ్యక్తిగత కారణాల వల్ల పోటీల నుంచి తప్పుకుంటు న్నట్లు తెలిపిన మిస్ ఇంగ్లాండ్. తమ దేశానికి వెళ్లిన తర్వాత మిస్ వరల్డ్ పోటీలపై సంచలన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో ఇంగ్లాండ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మిస్ వరల్డ్ పోటీల నుంచి తప్పుకోవడానికి గల కారణాలు వివరించింది. అయితే పోటీల్లో పాల్గొనేం దుకు వచ్చిన పోటీదారుల ను పోటీల్లో భాగంగా ఉదయం నుంచి రాత్రి వరకు మేకప్‌తోనే ఉంచుతున్నారని.. టిఫిన్ చేసే సమయంలో కూడా మేకప్ తీసే అవకాశం ఇవ్వడం లేదని ఆమె ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కొన్ని సందర్భాల్లో నైట్ డ్రెస్సులతో కూడా ఉండాల్సి వస్తుందని చెప్పుకొచ్చింది. కొన్ని ఈవెంట్లలో మేల్ స్పాన్సర్లతో కూర్చోవాల్సి వస్తుందని.. ధనవంతులైన స్పాన్సర్లను అలరించేలా తమపై ఒత్తిడి తెచ్చారని సంచలన ఆరోపణలు చేసింది. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో దీనిపై తీవ్ర చర్చ నెలకొంది.ఇక ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన తెలంగాణ ప్రభుత్వం ఆమె ఆరోపణ ల్లో నిజానిజాలను తేల్చేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారిణి శిఖా గోయల్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో మరో ఐపీఎస్ అధికారిణి రమా రాజేశ్వరి, సైబరాబాద్ డీసీపీ సాయి శ్రీలతో కూడా ఉన్నారు. అయితే ఈ త్రిసభ్యకమిటీ ఇప్పటికే తమ దర్యాప్తును ప్రారంభించింది. పోటీల్లో పాల్గొన్న ఇతర యువతు లను విచారించి, వారి వాంగ్మూలాలను సేకరించ నుంది. అవసర మైతే వీడియో రికార్డింగ్ చేసి మిల్లా మాగీ ఆరోపణ ల్లో నిజమెంతో తెలుసుకో నుంది. ఆమె ఆరోపించిన విధంగా పోటీల సందర్భంగా నిర్వా హకుల నుంచి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేయనుంది.

## పెన్నా నదిలో బయటపడిన అమ్మవారి విగ్రహం



నెల్లూరు జిల్లాలో అరుదైన ఘటన వెలుగుచూసింది. జొన్నవాడ కామాక్షితాయి టెంపుల్ సమీపంలోని పెన్నా నదిలో అమ్మవారి విగ్రహం బయటపడింది. సరిగ్గా కామాక్షితాయి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలోనే నదిలో అమ్మవారి విగ్రహం బయటపడటంతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చి.. శక్తి స్వరూపినిగా ఉన్న అమ్మవారి రూపాన్ని చూసి పూజలు నిర్వహిస్తున్నారు. విగ్రహాన్ని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అమ్మవారి విగ్రహం ఎక్కడి నుంచైనా కొట్టుకువచ్చిందా అన్నది తెలియాల్సి ఉంది

## డీఎస్పీ రవీందర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ ఘన సన్మాన సభ



పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో రామచంద్రపురం శ్రీ కన్వెన్షన్ హాల్ లో డీఎస్పీ శ్రీ రవీందర్ రెడ్డి గారి సేవలను స్మరించుకుంటూ ఆత్మీయ సన్మాన సభ ఘనంగా నిర్వహించబడింది.పటాన్‌చెరు డీఎస్పీగా తన పదవీకాలాన్ని పూర్తి చేసి బదిలీ అయిన రవీందర్ రెడ్డి గారి ప్రజాసేవా కృషికి గుర్తింపుగా ఈ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ సందర్భంగా ఆయనను కాట దంపతులు (కాట శ్రీనివాస్ గౌడ్ మరియు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా గారు) ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ, "రవీందర్ రెడ్డి గారు విధినిష్ఠతో, ప్రజలతో సమన్వయంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు," అని ప్రశంసించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ ఎస్పీ సంజీవ్ రావు గారు హాజరై, రవీందర్ రెడ్డి గారి సేవలను ప్రశంసించారు. ఆయన ప్రజలతో పాటు పోలీసు వ్యవస్థకు చేసిన కృషి, క్రమశిక్షణ, నిబద్ధత యావత్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.ఈ సన్మాన సభకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, మీడియా ప్రతినిధులు హాజరై, సభను మరింత విశిష్టంగా మార్చారు.

# ఢిల్లీలో వారంలోనే వంద మందికి కొవిడ్ పాజిటివ్

**భారత్‌లో వెయ్యి దాటిన యాక్టివ్ కేసులు -కేరళలో అత్యధికంగా 430 మందికి,**

**మహారాష్ట్రలో 209 మందికి వైరస్ - కొవిడ్‌తో మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ఇద్దరు, కర్ణాటకలో ఒకరు మృతి**

దేశ రాజధాని ఢిల్లీలో కొవిడ్ మహమ్మారి మరోసారి కలకలం రేపుతోంది. వారం రోజుల్లో నగరంలో వందకు పైగా కొత్త కేసులు నమోదయ్యాయి. 2020 నుంచి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న ఈ వైరస్ మళ్లీ పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 1,009కి చేరినట్లు కేంద్ర కొవిడ్-19 సమాచార నివేదిక వెల్లడించింది. ఒక్క ఢిల్లీలోనే 104 యాక్టివ్ కేసులు ఉండగా, వీటిలో 99 కేసులు గత వారం రోజుల్లోనే నమోదవడం గమనార్హం.రాష్ట్రాల వారీగా కేరళలో 430 మంది,




మహారాష్ట్రలో 209 మంది, ఢిల్లీలో 104 మంది కొవిడ్ బాధితులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గుజరాత్‌లో 83, కర్ణాటకలో 47, ఉత్తరప్రదేశ్‌లో 15, పశ్చిమ బెంగాల్‌లో 12 చొప్పున యాక్టివ్ కేసులు నమోదయ్యాయని తెలిపింది. కొవిడ్ కారణంగా మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ఇద్దరు, కర్ణాటకలో ఒకరు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. అయితే, అండమాన్ నికోబార్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ వంటి రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం ఒక్క యాక్టివ్ కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి.

# ఎంత పెద్ద సంస్థ అయినా ప్రీలాంచ్ అంటే మోసమే



రియల్ ఎస్టేట్ రంగంలో ప్రీ లాంచ్ ఆఫర్లు పెట్టుబడిదారులకు పీడకలగా మారాయి. నాలుగైదేళ్ల కిందట ప్రారంభమైన ట్రెండ్ ..నాలుగేళ్ల తర్వాత మోసాలుగా మారాయి. అప్పట్లో రెండు, మూడేళ్లలో ప్రాజెక్టును హ్యాండోవర్ చేస్తామని చెప్పి వేల మంది ఇళ్ల కొనుగోలుదారుల్ని మోసం చేశారు. ఈ విషయం నాలుగేళ్ల తర్వాతే వారికి అర్థమయింది. అప్పటికి వారి సొమ్ము కరిగిపోయింది. మోసం చేసిన వారు జైలుకు వెళ్లి.. బెయిల్ తెచ్చుకుని బయట తిరుగుతున్నారు. కానీ తమ కష్టాన్ని పోగొట్టుకున్న వారు మాత్రం ఇప్పటికి లబోదిబోమంటున్నారు.ఇన్ని మోసాలు జరుగుతున్నా ప్రీ లాంచ్ ఆఫర్లు పేరుతో డబ్బులు వసూలు చేయడం నేరం తెలిసినా కొన్ని బడా సంస్థలు మాత్రం వేర్వేరు పేర్లతో డబ్బులు వసూలు చేయడం మానడం లేదు. ఇటీవలి కాలంలో హైదారాబాద్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన బడా రియల్ ఎస్టేట్ కంపెనీలు ప్రాజెక్టుల్ని ప్రకటిస్తున్నాయి. భూమి పూజ రోజే బుకింగ్ ల కోసం ఆరాటపడుతున్నాయి. నిబంధన లకు అనుగుణంగా. బుకింగ్‌లు తీసుకోవడం కాకుండా..భారీ ఆఫర్లతో వన్ టైమ్ పేమెంట్స్.. ఇతర అవకాశాలు కల్పించి భారీగా నగదు వసూలు చేస్తున్నాయి. ఆ డబ్బులతోనే ప్రాజెక్టును ముందుకు నడిపించేందుకు ప్రయత్నిస్తున్నాయి .ఇలా అయితే ఎప్పుడు అయితే అమ్మకాల్లో ఫ్లో తగ్గుతుందో అప్పుడు ప్రాజెక్టు ఆగిపోతుంది. ఒక వేళ ఆ కంపెనీకి ఇతర ప్రాజెక్టులు ఉంటే..ఇక్కడ వసూలు చేసిన డబ్బులు ఆయా ప్రాజెక్టుల్లోకి పంపింగ్ చేస్తున్నాయి. అక్కడ అమ్మకాలు జరిగితే ఇక్కడ నిర్మాణం కొనసాగించవచ్చని అనుకుంటున్నాయి. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమే. కారణం ఏదైనా వినియోగ దారులు ..ఎంత పెద్ద బ్రాండ్ అయినా గుడ్డిగా నమ్మడం వల్ల నష్టమే జరుగుతుంది. అందుకే ప్రీ లాంచ్ ఆఫర్ల పేర్లు ఏవైనా %ా%ప్రాజెక్టు ప్రోగ్రెస్ లేకుండా డబ్బులు చెల్లించాలంటే ఒకటికి పది సార్లు ఆలోచించడం బెటర్

# మోదీ హిమాలయ పర్వతాల వంటివారు

**ఎవరికీ తల వంచరు: పవన్ కల్యాణ్ - దేశాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమన్న పవన్**

**ఓట్ల కోసం మోదీ ఆలోచించరని వ్యాఖ్య**

ఆపరేషన్ సిందూర్‌తో దేశ సత్తా చాటిన ఘనత మోదీదేనని ప్రశంసప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓట్ల గురించి ఆలోచించరని, దేశ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. హిమాలయ పర్వతాలు ఎలా తలవంచవో, అదే విధంగా మోదీ కూడా ఎక్కడా, ఎవరికీ తలవంచరని ఆయన ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో పవన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.దేశ ప్రగతికి ప్రధాని మోదీ ఇస్తున్న ప్రాధాన్యతకు 'పీఎం-జన్ మన్' కార్యక్రమమే నిదర్శనమని పవన్ తెలిపారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎప్పుడూ ఓట్ల గురించి ఆలోచించరు. దేశాభివృద్ధే లక్ష్యంగా ఆయన తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న ఈ కార్యక్రమం ద్వారా అత్యంత వెనుకబడిన గిరిజన సమూహాలు (పీవీటీజీ) నివసించే ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించగ ులుగు మోదీ హిమాలయ పర్వతాల వంటివారు.. ఎవరికీ తల వంచరు: పవన్ కల్యాణ్‌దేశాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమన్న పవన్‌ఓట్ల కోసం మోదీ ఆలోచించరని వ్యాఖ్యమోదీ హిమాలయ పర్వతాల వంటివారు.. ఎవరికీ తల వంచరు: పవన్ కల్యాణ్‌దేశాభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమన్న పవన్ ఓట్ల కోసం మోదీ ఆలోచించరని వ్యాఖ్యతున్నాం" అని ఆయన వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో "పీఎం-జన్ మన్" పథకం అమలు తీరును వివరిస్తూ,"కేంద్రప్రభుత్వం అందిస్తున్న రూ.555.61 కోట్ల నిధులతో రాష్ట్రంలో 612.72 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మిస్తున్నాము. ఇవన్నీ పీవీటీజీ ఆవాసాలను కలిపే రోడ్లే. వీటి ద్వారా ఏడు జిల్లాల్లోని 239 పీవీటీజీ ఆవాసాలకు రోడ్డు మార్గాలు ఏర్పడుతున్నాయి. తద్వారా సుమారు 50 వేల మంది గిరిజనులకు రవాణా సౌకర్యం కలుగుతుంది" అని పవన్ పేర్కొన్నారు. ఓట్లు వస్తాయో లేదో అని చూడకుండా, ప్రతి ఒక్కరికీ, అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ప్రధాని సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. ఈ స్ఫూర్తితోనే ఎన్డీఏ పాలిత రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు.' 'ఆపరేషన్ సిందూర్" వంటి క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా ప్రజల రక్షణతో పాటు వారి భవిష్యత్తు గురించి ప్రధాని మోదీ ఆలోచించారని, దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఆయనదేనని పవన్ కల్యాణ్ కొనియాడారు .కుల గణన ఆవశ్యకతను కూడా ఆయన నొక్కి చెప్పారు. "దేశంలో ఉన్న కులాల పరిస్థితులు, వారి జీవన విధానం, వృత్తులు, స్థితిగతులు తెలుసుకోవడానికి కుల గణన ఎంతో అవసరం. వారి జీవనోపాధిని మెరుగుపరచడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఏ పథకాలు తీసుకురావాలో పాలకులకు స్పష్టత వస్తుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు.అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర కేబినెట్ ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందని పవన్ వెల్లడించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలో మూడు నెలల పాటు పర్యటించి రూపొందించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.




# పవన్ కళ్యాణ్‌ని బెదిరిస్తున్నారా




"ఆ నలుగురు.. అంటూ రెండు రోజుల నుంచి వార్తలొచ్చాయి. వారి కబంధ హస్తాల్లోనే ఇండస్ట్రీ ఉన్నట్టు చెబుతున్నారు. ఆ నలుగురికి నాకు సంబంధం లేదు. ఆ నలుగురిలో నేను లేను' అని స్పష్టం చేశారు నిర్మాత అరవింద్. టాలీవుడ్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఈ రోజు అరవింద్ హైదరాబాద్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.'ఆ నలుగురు' అనే మాట 15 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. తర్వాత నలుగురు.. పది మంది అయ్యారు. అది ఎవరూ పట్టించుకోలేదు. ఆ నలుగురికి నాకు సంబంధం లేదు. నేను అన్ని వదిలేశాను. 1500 థియేటర్లకి 15 లోపే నా దగ్గర ఉన్నాయి. అవి కూడా తర్వలో వదిలేస్తాను. నా పని సినిమాలు నిర్మించడమే' అన్నారుథియేటర్స్ కి సంబంధించి ఏ మీటింగ్ కి నేను వెళ్లలేదు. మా సంస్థ నుంచి ఎవరిని కూడా వెళ్లొద్దు అని చెప్పాను. బంద్ అని చెప్పడం ఏకపక్షం నిర్ణయం. పవన్ కళ్యాణ్ సినిమా విడుదలకు సిద్ధంగా ఉండగా థియేటర్లు బంద్ చేయాలని అనుకోవడం నిజంగా దుస్సాహసం. ఎవరితో చర్చించకుండా అలా ఏకపక్షంగా థియేటర్స్ బంద్ అని ప్రకటించడం ఏమాత్రం సమంజసం కాదు. సమస్యలు వుంటే చర్చించి పరిష్కరించుకోవాలి కానీ ఇలా బంద్ అని ప్రకటించడం సరికాదు' అన్నారుఇదే సమయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటన గురించి ప్రస్తావించారు అరవింద్. థియేటర్స్ బంద్ అని చెప్పి పవన్ కళ్యాణ్ ని బెదిరిస్తున్నారా? అతని సినిమా వస్తున్న సినిమాలో బంద్ అని చెప్పడం ఏమిటి? ఆయన సినిమాలపై వ్యతిరేక లేదని కొందరు అంటారు కానీ, అనేటప్పుడు అలోచించుకొండి. ఆయన బాధ పడటంలో నిజాయితీ వుంది' అని అభిప్రాయం వ్యక్తం చేశారు.కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఇంతకాలమైనా ముఖ్యమంత్రిని కలవకపోవడంపై కూడా అరవింద్ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఓ నిర్మాతని ఇదే విషయంపై అడిగితే పెద్దగా స్పందించలేదన్నారు అరవింద్. మొత్తానికి నిన్న పవన్ కళ్యాణ్ 'రిటర్న్ గిఫ్ట్' ప్రెస్ నోట్ ఎఫెక్ట్ బాగానే పని చేసింది. ఈరోజు అరవింద్ స్పందించారు. మిగిలిన పెద్ద నిర్మాతలు, ఆ నలుగురు లిస్ట్ లో ఉన్నవాళ్లు కూడా ఇలానే ముందుకొచ్చి మాట్లాడితే జనాలకు క్లారిటీ దొరుకుతుంది.

## కుప్పంలోనే సీఎం కుటుంబం



AP: చిత్తూరు జిల్లా కుప్పంలో సీఎం చంద్రబాబు కుటుంబం గృహ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండు రోజులుగా సొంతింటిలో సీఎం ఫ్యామిలీ సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలో కుప్పం ప్రజలు సీఎం చంద్రబాబును కలుస్తుండగా మరోవైపు నూతన గృహంలో కుప్పం టీడీపీ నాయకులతో సీఎం భేటీ అవుతున్నారు. కుప్పం అభివృద్ధిపై చర్చించిన సీఎం ప్రజలను సొంత కుటుంబసభ్యులుగా చూసుకోవాలని టీడీపీ నేతలకు సూచించారు.

## తాజ్మహల్ రక్షణకు యాంటీ డ్రోన్ వ్యవస్థ



తాజ్మహల్ వద్ద యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని %జ×ూఖీ% నిర్ణయించింది. తాజ్ భద్రతాధికారి సయ్యద్ ఆరిఫ్ ఈ విషయాన్ని వెల్లడించారు.కట్టడం చుట్టూ సుమారు 8 కి.మీ పరిధిలో ఆ వ్యవస్థ పనిచేస్తుందని, ఏదైనా డ్రోన్ ప్రవేశిస్తే దాన్ని అడ్డుకుంటుందని వివరించారు. మరికొన్ని రోజుల్లో వ్యవస్థ ఏర్పాటు పూర్తవుతుందని పేర్కొన్నారు.ఆర్డీఎక్స్తో తాజ్ను పేల్చేస్తామని నిన్న బాంబు బెదిరింపు వచ్చిన సంగతి తెలిసిందే.

## కొలిక్కి వచ్చిన తెలంగాణ కేబినెట్ విస్తరణ




తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై నేడు తుది నిర్ణయం వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఢిల్లీలో ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. అదే విధంగా, ఇవాళ ఆయన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమై విస్తరణపై తుదిరూపురేఖలు ఖరారు చేసే అవకాశముంది. విస్తరణలో భాగంగా ఐదుగురు కొత్తవారికి మంత్రివర్గంలో స్థానం కల్పించే అంశంపై పార్టీలో చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.ఇప్పటికే రెండు నెలల క్రితమే విస్తరణపై కేసీ వేణుగోపాల్, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే లతో రాష్ట్ర నేతలు పలు విడతలుగా చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. పలువురు నాయకుల పేర్లు విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయి. మంత్రి పదవికి తమకే అవకాశం ఉందంటూ కొందరు ఇప్పటికే సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వివేక్, శ్రీహరి ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి లాంటి నాయకుల పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

## కవిత విషయంలో ఏం చేస్తారు



TG: BRSలో కవిత లేఖ వ్యవహారం హాట్ టాపిక్గా మారింది. ఇదే అంశంపై నిన్న KCR-KTR భేటీ అనంతరం ఆమె విషయంలో పార్టీ ఎలా ముందుకెళు ుందన్నది ఆసక్తిగా మారింది. ఈ వ్యవహారంపై పార్టీ నేతలు మాట్లాడొద్దని ఆదేశించిన అధిష్టానం, లోలోపల చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తోందని సమాచారం. కవితతో %ఖజ=% నేరుగా మాట్లాడే అవకాశముంది. ఆమెను బుజ్జగిస్తారా? మందలిస్తారా? అనంతరం కవిత ఎలా స్పందిస్తారు అనేది చర్చనీయాంశంగా మారింది.

## 2030నాటికి చైనా వద్ద 1000కి పైగా అణ్వస్త్రాలు : US నివేదిక




సైనిక సంపత్తిని చైనా అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తోందని %ఖూ% రక్షణ నిఘా సంస్థ (%ణ×ూ%) ఓ నివేదికలో పేర్కొంది. తిరుగులేని శక్తిగా కొనసాగేందుకు, %ఖూ%కు సవాలు విసిరేందుకు చూస్తోందని వివరించింది.2030నాటికి 1000కి పైగా అణు వార్హెడ్లను ఆ దేశం నిల్వ చేస్తుందని అంచనా వేసింది. చైనాను భారత్ తమ ప్రధాన ప్రత్యర్థిగా పరిగణిస్తోందని, దీటుగా సైనిక శక్తిని అభివృద్ధి చేసుకుంటోందని %ణ×ూ% పేర్కొంది.

# కేసీఆర్ మౌనవ్యూహం బీఆర్ఎస్‌కు మరిన్ని కష్టాలు



భారత రాష్ట్ర సమితిలో ఏర్పడిన అంతర్గత సంక్షోభం క్రమంగా పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కవితకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం పెరుగుతోంది. అదే సమయంలో కవితకు వ్యతిరేకంగా విశ్లేషణలు వస్తున్నాయి. కేసీఆర్ కుమార్తెగా తప్ప ఆమెకు ఎలాంటి గుర్తింపు లేదని..సొంత పార్టీ అంటూ పెడితే కార్పొరేటర్ గా కూడా గెలవలేరని ప్రో కేటీఆర్ సానుభూతిపరులు ప్రచారం చేస్తున్నారు. ఈ మొత్తం విషయంలో కేసీఆర్ మౌనం పాటిస్తున్నారు. స్పందించవద్దని పార్టీ నేతలకు చెబుతున్నారు.

**మౌన వ్యూహానికే ఓటేసిన కేసీఆర్**

కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో మౌనానికి ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. ఏదైనా పెద్ద సమస్యల వచ్చినప్పుడు ఆయన దాని గురించి పట్టనట్లే ఉంటారు. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని అనుకుంటారేమో కానీ మౌనాన్ని పాటిస్తారు. చివరికి ఓ నిర్ణయం తీసుకుంటారు. ఆ నిర్ణయానికి అందరూ అంగీకరించాల్సిన అవసరాన్ని కల్పిస్తారు. అయితే అది ప్రభుత్వ వ్యవహారాల్లో ఎక్కువగా జరిగింది. పార్టీ వ్యవహారాల్లో ఇలాంటి మౌనం వర్కవుట్ అవుతుందా లేదా అన్నది చెప్పడం కష్టం. ఇప్పుడు కవిత విషయంలో కేసీఆర్ అదే మౌన వ్యూహం పాటిస్తున్నారు.

**కవిత అంశంపై మాట్లాడవద్దని పార్టీ క్యాడర్ కు సంకేతాలు**

కవిత అంశంపై కేసీఆర్ మౌనంగా ఉంటున్నారు. కేటీఆర్, హరీష్ రావులతో మాత్రమే ఈ అంశంపై మాట్లాడారు. వారిని కూడా బహిరంగంగా స్పందించవద్దని కేసీఆర్ సూచించారని చెబుతున్నారు. కవిత వ్యూహం ఏమిటో స్పష్టంగా ఇంకా తెలియ నందున సైలెంటుగా ఉండటం మంచిదని కేసీఆర్ భావిస్తున్నారు. అయితే కవితను పిలిపించి మాట్లాడే విషయంలోనూ కేసీఆర్ తటపటాయిస్తున్నారు. కవిత ఫామ్ హౌస్ కు వెళ్లలేదో..కేసీఆర్ నుంచి పిలుపు రాలేదో స్పష్టత లేదు. కేసీఆర్ ను కవిత కలిస్తే అదో రాజకీయ హైడ్రామా అవుతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేసీఆర్ దాన్ని కోరుకోవడం లేదని అనుకోవచ్చు.

**మౌనం ఒక్కో సారి సమస్యను పెంచుతుంది !**

రాజకీయంగా ఏర్పడే సమస్యలను వీలైనంత త్వరగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. వారేం చేస్తారో అని చూస్తూ కూర్చుకుంటే అసంతృప్తిలో ఉన్న వారిలో అసహనం పెరిగిపోతుంది. కేసీఆర్ కవిత విషయంలో వేచి చూడాలన్న అభిప్రాయంలో ఉంటే అది మైనస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. కవిత సొంత పార్టీ పెట్టుకుంటే%ౌ% సక్సెస్ కాలేకపోవచ్చు కానీ ఖచ్చితంగా బీఆర్ఎస్ కు నష్టం జరుగుతంది. ఇప్పటికే పతనం దిశగా చాలా దూరం వెళ్లింది. పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లలో డిపాజిట్ రాలేదంటే..ఎన్ని విశ్లేషణలు చేసుకున్నా ఘోరమైన పతనం దిశగా ఉన్నట్లే. ఇప్పుడు కవిత కూడా రెబల్ గా మారితే.. అది మరింత పతనానికి దారి తీస్తుంది. మరి కేసీఆర్ అటు పార్టీ.. ఇటు కుటుంబం.. ఇక కుమార్తె %ౌ%.మధ్య బ్యాలెన్స్ చేసుకుని.. ఏ బంధమూ పగులకుండా చూసుకోవాలనుకుంటున్నారు. అది సాధ్యమవుతుందా లేదా అన్నదే కీలకం.

# చంద్రబాబుతో వి.సా.రెడ్డి దోస్తీ నిజమే అయితే జగన్‌కు భవిష్యత్ ఉంటుందా



విజయసాయిరెడ్డి చంద్రబాబుకు లొంగిపోయాడని జగన్ రెడ్డి ప్రెస్ మీట్‌లో ఆరోపించాడు. ఇలాంటి పరిస్థితి వస్తుందని చాలా మంది వైసీపీ నేతలు అనుకుని ఉండరు. ఎందుకంటే జగన్ రెడ్డి అవినీతి, కుటిల రాజకీయ ప్రస్థానంలో విజయసాయిరెడ్డిది కీలక పాత్ర. అక్రమాస్తులు వెనకేసుకోవడంలో అయినా.. పార్టీని ఓ సారి అధికారంలోకి తీసుకు రావడంలో అయినా విజయసాయిరెడ్డి పాత్ర ఏమిటో వైసీపీలో అందరికీ తెలుసు. అలాంటి వ్యక్తి ఇప్పుడు చంద్రబాబుకు లొంగిపోయాడని జగన్ రెడ్డి అంటున్నారు. ఇదిగో నిజమే అని వైసీపీ సోషల్ మీడియా ఓ ఇంట్లోకి విజయసాయిరెడ్డి, టీడీ జనార్ధన్ వెళ్తున్న దృశ్యాలు విడుదల చేసి ప్రచారం చేస్తోంది. నిజంగానే విజయసాయిరెడ్డి.. చంద్రబాబుతో చేతులు కలిపితే జగన్ రెడ్డికి భవిష్యత్ ఉంటుందా అనేది సగటు వైసీపీ కార్యకర్తకు వచ్చే సందేహం.

**ఓ ఇంట్లోకి టీడీ జనార్ధన్, వి.సా.రెడ్డి వెళ్లడం కుట్రనా ?**

ఓ ఇంట్లోకి మొదట టీడీపీ నేత టీడీ జనార్ధన్ వెళ్లారు. తర్వాత విజయ సాయిరెడ్డి వెళ్లారు. వాళ్లిద్దరూ ఆ ఇంట్లో చర్చలు జరిపారని వైసీపీ నేతలు , సోషల్ మీడియా ప్రచారం చేస్తున్నారు. వారు రహస్యంగా చర్చలు జరపాలనుకుంటే వారు ఇలా అందరికీ తెలిసేలా.. వెళ్తారా ?. సీసీ ఫుటేజీ వైసీపీకి వెళ్లేలా చూస్తారా అన్న కనీస లాజిక్ చూసుకోకుండా ఆరోపణలు చేస్తున్నారు.

**అది గాయపడిన ఓ రాజకీయ నేత నివాసం పరామర్శకు వెళ్లిన నేతలు !వైసీపీ నేతలు,**

సోషల్ మీడియా ప్రచారం చేస్తున్న వీడియోలు.. ఇటీవల గాయపడి ఆపరేషన్ చేయించుకున్న ఓ రాజకీయ నేత నివాసం. ఆయనను పరామర్శించేందుకు పలువురు ఆయన ఇంటికి వెళు _న్నారు. ఈ క్రమంలో టీడీ జనార్ధన్ కూడా వెళ్లారు. తర్వాత విజయసాయిరెడ్డి వెళ్లారు. ఇద్దరూ ఆయనను పరామర్శించి బయటకు వచ్చి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఇందులో కుట్రలు చేయడానికి ఏమీ లేదు. నిజంగా కుట్రలు చేయాలనుకుంటే ఇలా కాలవాల్సిన అవసరం ఉండదు. అంతకు మించిన మార్గాలు రాజకీయ నేతలకు ఉంటాయి.

**వి.సా.రెడ్డి తల్చుకుంటే జగన్ భవిష్యత్ భయంకరం**

వైసీపీ క్యాడర్ నమ్మినా నమ్మకపోయినా విజయసాయిరెడ్డి ఇప్పటికీ జగన్ రెడ్డిపై అభిమానం తోనే ఉన్నారు. తనను అవమానించారని జగన్ పై పగ తీర్చుకోవాలని ఇంకా అనుకోవడం లేదు. కానీ ఆయనను పదే పదే టార్గెట్ చేస్తూ.. ఆయన జగన్ పై పగ పెంచుకునేలా చేసేందుకు మాత్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అదే జరిగితే.. జగన్ రెడ్డి సంగతి చూడాలని అనుకుంటే జగన్ రెడ్డి భవిష్యత్ భయంకరంగా ఉంటుంది. జగన్ రెడ్డి గుట్టు ముట్లు అన్నీ తెలిసిన ఏకైక వ్యక్తి విజయసాయిరెడ్డి. లిక్కర్ కేసు కాదు అక్రమాస్తుల కేసులో అసలు విషయాలు చెబితే చాలు.. జగన్ రెడ్డి జీవితాంతం జైల్లోనే ఉంటారు. ఈ విషయాన్ని జగన్ తో పాటు ఆయన వందిమాగధులు మర్చిపోతే ఎలా

# మిస్ వరల్డ్ ఇష్యూ: రాజకీయం చేస్తే తెలంగాణ ఇమేజ్‌పైనే మరక

హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలపై ప్రపంచవ్యాప్త దృష్టి ఉంది. అయితే అనూహ్యంగా పోటీల నుంచి మధ్యలోనే అనారోగ్య కారణాలతో స్వచ్ఛందంగా వెళ్లిపోయిన మిస్ ఇంగ్లాండ్ లండన్ వెళ్లిపోయి అక్కడి మీడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చి నిర్వాహకులపై ఆరోపణలు చేశారు. అందులో తీవ్రమైనవి ఉన్నాయి. వేశ్యలా చూశారని అన్నారు. దీంతో సహజంగానే అందాల ప్రపంచంలో సునామీ వచ్చింది. ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. తెలంగాణలో రాజకీయం కూడా జరుగుతోంది. నిజమేంటో తెలియకుండా చేసే ఆరోపణలు, నిర్ధారణలతో మరకపడేది తెలంగాణపైనే.

**వందల మంది పోటీదారుల్లో ఒక్కరి ఆరోపణలు**

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు దాదాపుగా ప్రతి చిన్న దేశం నుంచి పోటీ దారులు వచ్చారు. వివిధ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. అందరూ ఆతిధ్యం పట్ల, పోటీల పట్ల సంతృప్తిగా ఉన్నారు. అయితే ఏం నచ్చలేదో కానీ.. మిస్ ఇంగ్లాండ్ వెళ్లిపోయారు. వెళ్లిపోయే ముందు ఆమె ఎక్కడా అసంతృప్తి వ్యక్తం చేయలేదు. ఏ విషయంలోనూ తప్పులు వెదకలేదు. వెళ్లేటప్పుడు కూడా సంతోషంగా వెళ్లారు. ఆమె స్థానంలో మిస్ ఇంగ్లాండ్ రన్నరప్ ను పోటీలకు ఆహ్వానించారు కూడా. అయితే లండన్ వెళ్లిపోయి అక్కడ మీడియా ముందు ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలు చాలా మందిని ఆశ్చర్యపరిచాయి. ముఖ్యంగా పోటీల నిర్వాహకుల్ని కూడా.

**మిస్ వరల్డ్ పోటీల్లో పార్టీలు, విందులు కామన్ !**

మిస్ వరల్డ్ పోటీలు అంటేనే అదో ప్రపంచం. కామన్ మ్యాన్ కు సంబంధం లేని ప్రోగ్రాం అది. హై ప్రొఫైల్ ప్రపంచంలో ఉండే వారికి అదో ప్రత్యేకమైన కార్యక్రమం. పార్టీలు, విందులు అనేది సహజం. తెలంగాణ ప్రభుత్వం తాము కొంత ఖర్చు పెట్టి ఆతిధ్యం ఇస్తున్నందున వారితో ప్రచారం చేయించుకోవాలని అనుకుంది. అందుకే టూరిజం ప్రాంతాలకు పర్యటనలు చేయించింది. తెలంగాణ పర్యాటక ప్రాంతాలకు మరింతగా ప్రచారం కల్పించేందుకు ప్రయత్నించింది. ఈ విషయంలో ఎక్కడైనా విమర్శలు వచ్చాయంటే..అది తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ఖర్చు మీదనే. ఇరవై కోట్లే ఖర్చు పెడుతున్నామని కాంగ్రెస్ అంటే కాదు రెండు వందల కోట్లు అని బీఆర్ఎస్ అంటోంది.

**మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై సోషల్ మీడియాలో**




**ప్రచారం**

మిస్ ఇంగ్లాండ్ ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. నిజా నిజాలు ఇంకా బయటకు రాక ముందే కొంత మంది కాంగ్రెస్ పై ద్వేషంతో .. ఏదో జరిగిపోయిందన్న ప్రచారం ప్రారంభించారు. ఏమీ లేని ఫోటోలను పెట్టి.. ఇక్కడే ఏదో జరిగిందని విశ్లేషించడం ప్రారంభించారు. ఇలా చేయడం వల్ల తెలంగాణపైనే మరక పడుతుంది. ఎందుకంటే మిస్ ఇంగ్లాండ్ చేసినవి చిన్న ఆరోపణలు కాదు. మహిళల క్యారెక్టర్ పై నింద వేసే ఆరోపణలు. అలాంటివి జరిగాయని ప్రచారం చేస్తే తెలంగాణ ఇచ్చిన ఆతిధ్యానికే మరక పడుతుంది. తెలంగాణ మీదనే ముద్ర పడుతుంది. రాజకీయం కోసం అలా చేయడం మంచిది కాదు.


# పాలి సెట్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన దీక్షిత



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి**

విడుదలైన తెలంగాణ పాలీసెట్ - 2025 ఫలితాలలో శ్రీ విద్యాస్ అభ్యాసన పాఠశాల విద్యార్థిని "వి. దీక్షిక" రాష్ట్ర స్థాయిలో ఎం.పి.సి. విభాగంలో 120 కి 120 మార్కులకు మొదటి ర్యాంక్ , ఎం.బై.పి.సి. విభాగంలో 150 కి 148 మార్కులకు 8వ ర్యాంక్ సాధించింది. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరచి 590 మార్కులు సాధించింది. ఇంతటి విజయాన్ని సాధించిన దీక్షికను పాఠశాలల %జ.జు.నా%. చైతన్య కృష్ణ , %+.వీ%. నరేష్ , ప్రధానోపాధ్యాయురాలు నాగ వల్లి , డీన్ సంతోష్ మరియు ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

## పుతిన్ హెలికాప్టర్ ను టార్గెట్ చేసిన ఉక్రెయిన్ డ్రోన్ ను మధ్యలోనే అడ్డుకున్న రష్యా!




ఉక్రెయిన్ డ్రోన్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్న పుతిన్పుతిన్ ఎయిర్ రూట్‌లో ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్ ను మార్గమధ్యంలోనే కూల్చివేసిన రష్యా ఎయిర్ ఢిఫెన్స్ సిస్టమ్‌ఉద్దేశపూర్వకంగా జరిపిన దాడి యత్నంగా భావిస్తున్న రక్షణ విభాగంరష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్ డ్రోన్ దాడికి పాల్పడింది. అయితే, ఈ దాడి నుంచి పుతిన్ తృటిలో తప్పించుకున్నారని రష్యా అధికారులు వెల్లడించారు.సమస్యాత్మక సరిహద్దు ప్రాంతమైన కుర్స్క్‌లో అర్ధరాత్రి దాటిన తర్వాత పుతిన్ పర్యటనకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ బలగాలను ఆ ప్రాంతం నుంచి తరిమికొట్టినట్లు ఏప్రిల్‌లో రష్యా ప్రకటించినప్పటి నుంచి కుర్స్క్ ప్రాంతంలో పుతిన్ పర్యటించడం ఇదే తొలిసారి.పుతిన్ ప్రయాణిస్తున్న మార్గంలోకి ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్‌ను రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ మధ్యలోనే అడ్డుకుని కూల్చివేసిందని అధికారులు తెలిపారు. అధ్యక్షుడి కాన్వాయ్‌ను గాల్లో ఉండగానే ఢీకొట్టే లక్ష్యంతో ఈ దాడి జరిగిందని రక్షణ విభాగంలోని ఓ సీనియర్ అధికారి పేర్కొన్నట్లు రష్యా మీడియా వెల్లడించింది.ఈ ఘటనపై రష్యా భద్రతా ఏజెన్సీలు విచారణ జరుపుతున్నాయి. ఉక్రెయిన్ డ్రోన్ ఏ విధంగా కుర్స్క్ ఎయిర్ స్పేస్‌ను ఉల్లంఘించింది? ఇది హత్యాయత్నమా? కీవ్ సైకలాజికల్ స్ట్రాటజీలో ఇదొక భాగమా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో పదవుల పంచాయతీ తేలడం లేదు



అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయిందన్న మాటే కానీ ఎవరికీ సంతృప్తి లేదు. మంత్రి పదవుల భర్తీ లేదు, నామినేటెడ్ పోస్టుల్లేవు.. కనీసం పీసీసీ కార్యవర్గాన్ని కూడా భర్తీ చేయలేక పోతున్నారు. ఎప్పటికప్పుడు వివిధ కారణాలతో వాయిదాలు పడుతూనే వస్తున్నాయి. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఆ పనులు పూర్తి చేయాలని అనుకుంటున్నారు. హైకమాండ్ కూడా ఎప్పట్లాగే కసరత్తు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. కానీ గ్రీన్ సిగ్నల్ వస్తుందా అన్నది మాత్రమే ఎవరికీ అర్థం కావడం లేదు.

**మంత్రి పదవుల కోసం భారీ రేస్**

ఖాళీ ఉన్నది ఆరు మంత్రి పదవులు. కానీ పోటీ పడుతున్న వారు ఇరవై మంది వరకూ ఉన్నారు. ఇంకా మిగిలిన వారూ తమ ప్రయత్నాలు తాము చేసుకుంటున్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ చాన్స్ రాదని అనుకుంటున్నారు. అయితే ఇప్పుడు మంత్రి పదవుల్ని భర్తీ చేయాలంటే.. జిల్లాలు, సామాజికవర్గాలను సమన్వయం చేసుకోవాలి. అలా చేసుకుంటే ఆశలు పెంచుకున్న పార్టీ నేతలకు అవకాశం ఇవ్వలేరు. అలా ఇవ్వకపోతే వారు చేసే రచ్చ పార్టీని డ్యామేజ్ చేస్తుంది. అందుకే ఏడాదిగా మంత్రి పదవుల భర్తీ అంశాన్ని పక్కన పెట్టేశారు.

**కనీసం నామినేటెడ్ పోస్టుల భర్తీ అయినా ?**

కాంగ్రెస్ క్యాడర్ పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉంది. పార్టీని నమ్ముకున్న వాళ్లు.. తమకు ఏదో ఓ పదవి వస్తుందని ఆశ పడుతున్నారు. ఈ అశ ఇలా కొనసాగుతూనే ఉంది. కొన్ని పదవులు ప్రకటించినా ఇంకా మెజార్టీ పదవుల్ని ప్రకటించాల్సి ఉంది. ఇందు కోసం కొత్త ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఓ ఫార్ములాను రెడీ చేశారు. దానిపై కసరత్తు చేశారు. పదవుల పేర్లతో షార్ట్ లిస్టు కూడా రెడీ అయిందని చెప్పుకున్నారు. కానీ ప్రకటన మాత్రం రావడం లేదు.

**పార్టీపదవులపైనా అదే నాన్చుడు**

పీసీసీ చీఫ్ ను నియమించారు కానీ ఇప్పటి వరకూ కార్యవర్గం లేదు. మంత్రి పదవులకు, నామినేటెడ్ పోస్టులకు లింకు పెట్టి అక్కడ చాన్స్ దక్కని వారికి పార్టీ పదవులు ఇవ్వాలనుకుం టున్నారు. ఇక్కడా కసరత్తులు చేసి చాలా కాలం అయింది. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయమూ ప్రకటించలేదు. పార్టీ పరిస్థితి మెరుగుపడాలంటే.. ముందుగా క్యాడర్ కు పదవులు ఇవ్వాలి. ఎంత ఆలస్యం చేస్తే అంత డ్యామేజ్ జరుగుతుంది. రాష్ట్ర నాయకత్వాన్ని ఎంత బలంగా ఉంచితే.. వారు పదవుల పంపకం తర్వాత ఏర్పడే సమస్యల్ని అంతగా కవర్ చేస్తారు. కానీ ఈ రెండు విషయాల్లోనూ హైకమాండ్ నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది.

## పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభం...సైనిక వ్యాపార విస్తరణతో

# అగమ్యగోచరంగా భవిష్యత్తు..

**పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిల్వల సంక్షోభం**

**ఐఎంఎఫ్ కఠిన ఆంక్షలతో ప్రజల అవస్థలు, సైనిక వ్యయం మాత్రం యథాతథం**

**దేశ జీడీపీలో రక్షణ రంగానికి భారీ కేటాయింపులు, విద్య, వైద్యానికి మొండిచెయ్యి**

**'మిల్‌బస్' పేరుతో సైన్యం విస్తృత వ్యాపారాలు, అనేక రంగాల్లో గుత్తాధిపత్యం**

**సైనిక ఆర్థిక జోక్యం వల్ల ప్రజాస్వామ్య ప్రభుత్వాలు నామమాత్రంగా మారుతున్నాయన్న విమర్శలు**




పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ప్రపంచానికి సుపరిచితమే. ఇటీవలి సంవత్సరాలలో, ఆ దేశం ఆందోళనకరమైన ద్రవ్యోల్బణం, విదేశీ మారక నిల్వల నిరంతర సంక్షోభం, పెనుభారంగా మారిన అప్పులతో సతమతమవుతోంది. ఈ సమస్యలు విస్తృత నిరుద్యోగం, పేదరికం పెరుగుదల, ఉగ్రవాద దాడులు, వాటిని ఎదుర్కొనేందుకు జరుగుతున్న సైనిక కార్యకలాపాల మధ్య నలిగిపోతున్న ప్రజల దైనందిన జీవితాన్ని మరింత దుర్భరం చేశాయి. ఈ దయనీయ పరిస్థితి, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) విధించిన కఠిన ఆర్థిక పొదుపు చర్యల ప్రభావం ప్రజలపై తీవ్రంగా ఉన్నప్పటికీ, పాకిస్థాన్ భారీ సైనిక వ్యవస్థ మాత్రం ఎలాంటి ప్రభావానికి లోనుకాకుండా, జాతీయ ఆర్థిక వ్యవస్థలో తన వాటాను క్రమంగా పెంచుకుంటోంది. పాకిస్థాన్ దేశీయ వ్యవహారాలలో సైన్యం పాత్ర కేవలం రాజకీయాలు, విదేశాంగ విధానాలకే పరిమితం కాలేదు. ఆర్థిక రంగంలోకి కూడా ఇది గణనీయంగా విస్తరించింది. ప్రాథమికంగా, సైన్యం దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో సింహభాగాన్ని పొందుతోంది. గత ఆర్థిక సంవత్సరానికి పాకిస్థాన్ రక్షణ వ్యయం జీడీపీలో 2.3 శాతంగా ఉంది. ఇది భారత్, చైనా, యూరోపియన్ యూనియన్ దేశాల కంటే ఎక్కువ కావడం గమనార్హం. ఒక ప్రముఖ బిజినెస్ పోర్టల్ అధ్యయనం ప్రకారం, 2017 నుంచి 2025 ఆర్థిక సంవత్సరాల మధ్య పాకిస్థాన్ రక్షణ బడ్జెట్ వార్షిక వృద్ధి రేటు 12.6 శాతంగా ఉండగా, భారత్‌లో ఇది 8 శాతంగా ఉంది. దీనికి విరుద్ధంగా, విద్య, ఆరోగ్య రంగాలకు పాకిస్థాన్ జీడీపీలో వరుసగా కేవలం 2 శాతం, 1.3 శాతం మాత్రమే కేటాయించడం ఆందోళన కలిగిస్తోంది.

**'మిల్‌బస్': సైనిక వ్యాపార సామ్రాజ్యం**

ఇంతేకాకుండా, సైన్యం ఒక విస్తృతమైన ప్రైవేటు వాణిజ్య సమ్మేళనాన్ని అభివృద్ధి చేసింది. దీనిని ప్రముఖ విద్యావేత్త అయేషా సిద్దిఖా తన 'మిలిటరీ ఇంక్2: ఇన్‌సైడ్ పాకిస్థాన్స్ మిలిటరీ ఎకానమీ' అనే పుస్తకంలో 'మిల్‌బస్' (సైనిక వ్యాపారం)గా అభివర్ణించారు. ఫౌజీ ఫౌండేషన్, ఆర్మీ వెల్ఫేర్ ట్రస్ట్, షాహీన్ ఫౌండేషన్, బహ్రియా ఫౌండేషన్, అత్యంత వివాదాస్పదమైన డిఫెన్స్ హౌసింగ్ అథారిటీ (డీహెచ్‌ఏ) వంటి వాణిజ్య సంస్థల నెట్‌వర్క్ ద్వారా సైన్యం రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్, తయారీ, వ్యవసాయం, షిప్పింగ్, విద్య, మీడియా వంటి అనేక రంగాలలో పాతుకుపోయింది. కొన్ని అంచనాల ప్రకారం, దేశంలోని సుమారు 12 శాతం భూమి సైన్యం నియంత్రణలో ఉందని తెలుస్తోంది.

**విమర్శలు, వివాదాలు**

సైన్యం, దాని మద్దతుదారులు తాము ఆర్థిక కార్యకలాపాలలో వృత్తి నైపుణ్యం, స్థిరత్వం, సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తామని వాదిస్తున్నప్పటికీ, అనేక మంది విమర్శకులు ఈ సైనిక ఆధిపత్యం యొక్క గుత్తాధిపత్య, విస్తృత, అపారదర్శక స్వభావాన్ని ప్రశ్నిస్తున్నారు. రక్షణ శాఖ ఆధ్వర్యంలోని పరిశ్రమలు స్థానిక పోటీని, ప్రైవేటు సంస్థలను అణచివేస్తూ, పన్ను రాయితీలు, కనిష్ఠ నియంత్రణ పర్యవేక్షణల నుంచి ప్రయోజనం పొందుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

రక్షకుడికి, లాభార్జనపరుడికి మధ్య ఉన్న హద్దును చెరిపివేయడం ద్వారా, సైన్యం ప్రజా సంక్షేమం, మార్కెట్ సమానత్వ సూత్రాల కంటే వ్యూహాత్మక ప్రయోజనాలకు, సొంత వాణిజ్య లాభాలకు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీహెచ్‌ఏ వ్యాలీ ఇస్లామాబాద్ మోసం వంటి కొన్ని సంస్థలు అవినీతి కుంభకోణాలలో చిక్కుకున్నప్పుడు, లేదా సింధు నది కాలువల ప్రాజెక్టు వంటి వాటిలో ప్రజా ప్రయోజనాలను విస్మరించినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రమవుతున్నాయి.

ప్రారంభంలో పదవీ విరమణ చేసిన సైనిక సిబ్బందికి సరసమైన గృహాలను అందించడానికి స్థాపించబడిన డీహెచ్‌ఏ, ఇప్పుడు ఉన్నత వర్గాల నివాస ప్రాజెక్టులకు నెలవుగా మారింది. అనుమానాస్పద భూసేకరణలు, ఉన్నత వర్గాలకు ప్రయోజనం చేకూర్చేందుకు సామాన్యులను నిర్వాసితులను చేయడంపై డీహెచ్‌ఏ విస్తృత విమర్శలను ఎదుర్కొంది. అంతేకాకుండా, 2021 నాటి పండోరా పత్రాలలో సీనియర్ సైనిక అధికారుల పేర్లు బయటపడటం, వారు కీలకమైన జాతీయ ఆస్తులను విదేశీ ఆర్థిక మార్గాల ద్వారా ఎలా తరలిస్తున్నారో బహిర్గతం చేసింది.

**ప్రజాస్వామ్యంపై ప్రభావం**

పాకిస్థాన్‌లో 'మిల్‌బస్' మానవ అభివృద్ధిలో దీర్ఘకాలిక, తీవ్రమైన పెట్టుబడుల కొరతను మరింత తీవ్రతరం చేయడమే కాకుండా, సైన్యం యొక్క గణనీయమైన ఆర్థిక ప్రభావం దేశంలో దాని రాజకీయ ఆధిపత్యాన్ని బలోపేతం చేస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల పాటు ప్రత్యక్షంగా పాలించిన సైన్యం, పౌర ప్రభుత్వాల కాలంలో కూడా తెర వెనుక గణనీయమైన ప్రభావాన్ని చూపుతూ పాకిస్థాన్‌లో అత్యంత శక్తివంతమైన సంస్థగా కొనసాగుతోందన్నది నిర్వివాదాంశం. ఆర్థిక వ్యవస్థపై సైన్యం సర్వవ్యాప్త నియంత్రణ కారణంగా, పౌర ప్రభుత్వాలు ప్రజల అవసరాలు, ప్రయోజనాల ఆధారంగా స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని చాలావరకు కోల్పోతున్నాయి.

## పదవుల మీద వ్యామోహంతో తాను పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టలేదు




అగ్ర నటుడు కమల్‌హాసన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థగ్ లైఫ్' . మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం శనివారం చెన్నై వేదికగా జరిగింది. ఇందులో పాల్గొన్న కమల్ హాసన్ సినిమాపై ఎంతో నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు. తాము గొప్ప సినిమా రూపొందించామని.. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం తన రాజకీయ జీవితం పై మాట్లాడారు. పదవుల మీద వ్యామోహంతో తాను పాలిటిక్స్‌లోకి అడుగుపెట్టలేదన్నారు."ముఖ్యమంత్రి కావాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టలేదు. తమిళనాడు రాష్ట్ర ప్రజలకు నా వంతు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చా. ప్రజల కోసం మేము వివిధ కార్యక్రమాలు చేస్తున్నాం. నిదానంగా అనుకున్నది సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. వాళ్లు అద్భుతంగా వర్క్ చేస్తున్నారు. అందుకు నేనెంతో గర్వపడుతున్నా. శింబు మీరు కూడా మీ వాళ్ల కోసం నిలబడాలి. వాళ్లను అలరించడం కోసం మరింత శ్రమించాలి. మా సినిమా 'థగ్‌లైఫ్' విషయంలో నమ్మకంగా ఉన్నాం. ప్రేక్షకులు తప్పకుండా మా చిత్రాన్ని ఆదరిస్తారు. శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే బయటవాళ్లకు అమ్మాను. డిస్ట్రిబ్యూషన్ మేమే చేస్తున్నాం. మేము ఒక మంచి చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులు ఆదరిస్తే.. మా నిర్మాణ సంస్థలో ఇలాంటి ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం. ఈ సినిమాలో మలయాళ నటుడు జోజూ జార్జ్ కీలక పాత్ర పోషించారు. నటీనటులు ఏదైనా కొత్తగా ప్రయత్నిస్తే.. వారిని నేను పోటీగా తీసుకుంటా. కానీ, జోజూ విషయంలో మాత్రం అసూయ ఫీలవుతుంటా. ఆయన అద్భుతంగా వర్క్ చేస్తుంటారు. ఏది ఏమైనా నటీనటులను స్వాగతించాల్సిన బాధ్యత నాపై ఉంది" అని కమల్ హాసన్ అన్నారు. ఆయన మాటలతో జోజూ ఎమోషనల్ అయ్యారు.

## మే 31 తేదీన చలో వరంగల్

**మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకడానికి సిద్ధం కండి**

**ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోల్ల నరసింహ మాదిగ**



ఎమ్మార్పీఎస్ అన్ని విభాగాల కార్యకర్తల ఆధ్వర్యంలో చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఎంఆర్పీఎస్ అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం షాద్ నగర్ దేవిగ్రాండ్ మీటింగ్ హాల్లో ఎమ్మార్పీఎస్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడు నాగభూషణ్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ళ నరసింహ మాదిగ పాల్గొని మాట్లాడుతూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారు 30 సంవత్సరాల నుండి జాతి కోసం ఉద్యమ పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగినది ఎంఆర్పీఎస్ దండోరా ఉద్యమంలో సమాజానికి ఆయన చేసిన సేవలను గుర్తించి. ఈనెల 27వ తేదీ న ఢిల్లీలో మందకృష్ణ మాదిగ అన్నగారు అత్యున్నత అవార్డు పద్మశ్రీ పురస్కారాన్ని అందుకొని 31వ తేదీన వరంగల్ కు చేరుకుంటారు కావున యావత్ మాదిగ జాతి మొత్తం జాతి మహాత్ముడైన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నగారికి ఘన స్వాగతం పలుకుదాం ర్యాలీ విజయవంతం చేయడానికి రంగారెడ్డి జిల్లా లోని నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి వాహనలా జన సమీకరణతో 31 తేదీన చలో వరంగల్ కు ప్రతి గ్రామం మండలం, నియోజకవర్గాల, గ్రామాల నుండి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ కి వచ్చే ప్రతి ఒక్కరూ డ్రెస్ కోడ్ ధరించుకొని రావాలని విజ్ఞప్తి చేస్తున్నామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షులు నాగభూషణం మాదిగ, కల్లేపల్లి బాలరాజు మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు చెన్నగల్ల శ్రావణ్ కుమార్ మాదిగ సీనియర్ నాయకులు, గుడెపు ప్రవీణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు, చెదురువల్లి లింగం మాదిగ, రాయికల్ వెంకటేశ్ మాదిగ, దేశరథ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు..

## ఏసీబీ వలలో చిక్కిన అవినీతి తిమింగలం




**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి ఖమ్మం**

ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడి: లంచం తీసుకుంటూ సబ్ రిజిస్ట్రార్ రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ ఖమ్మం, మే 26, 2025: ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచం స్వీకరిస్తూ సబ్ రిజిస్ట్రార్ అరుణ్ రెడ్ హ్యాండెడ్‌గా యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డాడు. గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంట్ రైటర్ పుచ్చాకాయల వెంకటేశ్వరరావు ద్వారా రూ. 30,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ బృందం అతడిని అరెస్ట్ చేసింది. ఏసీబీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) వై. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో, అరుణ్ మొత్తం రూ. 50,000 డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. అయితే, బేరసారాల తర్వాత రూ. 30,000కు అంగీకారం కుదిరింది. ఫిర్యాది ఇచ్చిన సమాచారం మేరకు ఏసీబీ బృందం ట్రాప్ ఏర్పాటు చేసి, లంచం స్వీకరిస్తున్న సమయంలో అరుణ్‌ను పట్టుకుంది. ప్రస్తుతం కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన అరుణ్‌ను విచారణ కోసం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. లంచం కేసులో మరిన్ని వివరాల కోసం ఏసీబీ దర్యాప్తు కొనసాగుతోంది.

## సీఆర్ పీఎఫ్ జవాను కూడానా..!

**పాక్ కు గూఢచర్యం చేస్తున్న జవాన్ అరెస్టు**

**డబ్బు కోసం దేశ రహస్యాలు లీక్ చేసినట్లు ఆరోపణ**

**జవాన్‌కు ఎన్ఐఏ కస్టడీ విధించిన న్యాయస్థానం**

**జాతీయ భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశమని కోర్టు వ్యాఖ్య**




పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేస్తున్న యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా వ్యవహారం వెలుగు చూసిన తర్వాత కేంద్రం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలను అలర్ట్ చేసి గూఢచారులను అరెస్టు చేస్తోంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో గూఢచారులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొందరు డబ్బుకోసం పాక్ కు రహస్యాలు చేరవేస్తుండగా మరికొందరు హనీట్రాప్ లో చిక్కి ఈ పని చేస్తున్నారని తెలుస్తోంది. తాజాగా ఈ గూఢచారుల జాబితాలో ఓ జవాను ఉన్నట్లు తేలడం దేశవ్యాప్తంగా కలకలం సృష్టిస్తోంది. దేశ రక్షణ కోసం పనిచేసే సీఆర్ పీఎఫ్ జవాను ఒకరు డబ్బు కోసం పాకిస్థాన్ కు అమ్ముడుపోయాడని, కీలకమైన రహస్యాలు మన శత్రు దేశానికి చేరవేశాడని అధికారులు గుర్తించారు. సదరు జవాన్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు అరెస్టు చేసి ప్రత్యేక కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ ఆరోపణలు "జాతీయ భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తాయని" వ్యాఖ్యానించింది. "ఈ ఆరోపణలు జాతీయ భద్రతకు, భారతదేశాన్ని సందర్శించే పౌరుల ప్రాణాలకు, అలాగే భారత పౌరుల ప్రాణాలకు ముప్పు కలిగించేవి" అని కోర్టు పేర్కొంది. నిందితుడు పాకిస్థాన్‌కు ఎలాంటి సమాచారం చేరవేశాడన్న వివరాలను రాబట్టడం అత్యంత కీలకమని అభిప్రాయపడిన కోర్టు, జవాన్‌ను జూన్ 6 వరకు ఎన్ఐఏ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. "దేశ బలానికి, భద్రతకు సాయుధ బలగాలే మూలస్తంభాలు. వాటికి కోలుకోలేని నష్టం కలిగించే ఎలాంటి ప్రయత్నమైనా దర్యాప్తు చేయాల్సిన తీవ్రమైన విషయం" అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.నిందితుడిపై చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టంలోని సెక్షన్ 15 (ఉగ్రవాద చర్యకు పాల్పడటం), సెక్షన్ 16 (ఉగ్రవాద చర్యకు శిక్ష), సెక్షన్ 18 (కుట్ర మరియు సంబంధిత చర్యలకు శిక్ష) కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన ఘటన నేపథ్యంలో, పాకిస్థాన్‌కు సమాచారం అందిస్తున్న గూఢచారులు, ఉగ్రవాదులకు సహకరిస్తున్న వారిపై భద్రతా దళాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. ఈ క్రమంలోనే తాజా అరెస్టు జరిగినట్లు తెలుస్తోంది.

## 'గేమ్ ఛేంజర్ సినిమాను ఓ నిర్మాత పైరసీ చేశారు'



సినీ ఇండస్ట్రీ వివాదంపై నిర్మాత దిల్ రాజు స్పందించారు. గేమ్ ఛేంజర్ విడుదలైన తొలిరోజే పైరసీ వచ్చిందని, ఆ పైరసీ చేసింది మరో నిర్మాత కావొచ్చన్నారు. ఇండస్ట్రీలో కొందరు నీచంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ప్రస్తుతం అత్యధిక సినిమాలు పర్సంటేజ్ విధానంలోనే ఆడుతున్నాయన్నారు. సినీ రంగంలో యూనిటీ లేదని.. అందరూ కలిస్తేనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. తమకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ముఖ్యమే అన్నారు

### ఆపరేషన్ సిందూర్‌పై పాక్‌కు ముందే సమాచారం ఇచ్చారనే

# ఆరోపణలపై స్పందించిన జైశంకర్

- ఉగ్ర స్థావరాలపై దాడుల తర్వాతే పాక్‌కు సమాచారం ఇచ్చామన్న జైశంకర్
- దాడులు ముగిసి, పీఐబీ ప్రకటన వచ్చాకే పాక్ డీజీఎంవోకు తెలిపామన్న మంత్రి
- పార్లమెంటరీ కమిటీ సమావేశంలో విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ ఆరోపణలు వాస్తవాలను వక్రీకరించడమేనని వ్యాఖ్య
- దేశం మొత్తం ఒక్కతాటిపై నడవాలని ఎంపీలకు పిలుపు




ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన దాడుల గురించి పాకిస్థాన్‌కు ముందుగా తెలియజేయలేదని, ఆపరేషన్ విజయవంతంగా ముగిసిన తర్వాతే వారికి సమాచారం అందించామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు విదేశాంగ శాఖకు చెందిన పార్లమెంటరీ సలహా కమిటీ సమావేశంలో ఆయన కీలక విషయాలు వెల్లడించారు. దాడులు పూర్తయిన తర్వాత, పీఐబీ ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేశాకే పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో)కు ఈ విషయం తెలియజేశామని ఆయన సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ, "ఉగ్రవాద స్థావరాలపై దాడులు ముగిసిన అనంతరం పాకిస్థాన్ డీజీఎంవోకు సమాచారం అందించడం జరిగింది. అప్పటికే పీఐబీ నుంచి తొలి ప్రకటన కూడా జారీ అయింది" అని తెలిపారు. విదేశీ పర్యటనలకు వెళ్లే భారత పార్లమెంట్ సభ్యుల బృందాలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసేలా వ్యవహరించాలని, దేశ ప్రయోజనాల విషయంలో అందరూ ఏకతాటిపై నిలవాలని ఆయన కోరారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులకు ముందే పాకిస్థాన్‌కు సమాచారం ఇచ్చారంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఇది వాస్తవాలను వక్రీకరించడమేనని జైశంకర్ వ్యాఖ్యానించినట్లు సీఎన్‌బీసీ-న్యూస్18 కథనం పేర్కొంది. దాడుల విషయం ఇస్లామాబాద్‌కు ముందుగానే చెప్పాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గతంలో ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జైశంకర్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్ ఆరోపణలను తోసిపుచ్చుతూ, ప్రభుత్వం సరైన సమయంలోనే పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని ఆయన స్పష్టం చేశారు.

## ఏన్ కౌంటర్ లో మృతి చెందిన విజయలక్ష్మి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలి

**శవాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడం భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం..**

**షాద్ నగర్ లో ప్రజా సంఘాల నాయకుల మీడియా సమావేశం..**

**ప్రభుత్వం స్పందించాలని డిమాండ్..**

**శవాలకు కూడా హక్కులు ఉంటాయి..**

**ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలనీ డిమాండ్..**



ఈ నెల 21 తేదీన జరిగిన ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ ఎన్కౌంటర్ లో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని కేశంపేట మండలం వేముల్ నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి, (భూమిక) మృతదేహంతో పాటు ఎన్కౌంటర్ లో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ తెలంగాణకు సంబంధించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పజెప్పాలని షాద్ నగర్ పట్టణంలో ప్రజాసంఘాలు పౌర హక్కుల నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ నాయక్, ప్రజా సంఘాల నాయకులు తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు అర్జునప్ప పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రవీంద్రనాథ్ తదితరులు మాట్లాడుతూ ఛత్తీస్ ఘడ్ పోలీసులు విజయలక్ష్మి మృతదేహాన్ని బంధుమిత్రులకు అప్ప చెప్పకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చాలా క్రూరంగా వ్యవహరిస్తున్నాయనీ శవాల పట్ల పాటించాల్సిన కనీస మర్యాదను, బాధ్యతను కూడా పాటించట్లేదని నాలుగు రోజులుగా శవాల కోసం బంధుమిత్రులు హాస్పిటల్ చుట్టూ పడిగాపులు కాస్తూ ఉంటే ఛత్తీస్ ఘడ్ పోలీసులు వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారు. అంబులెన్స్ డ్రైవర్లను బెదిరిస్తూ వారి వాహనాలను సీజ్ చేస్తామని, వారి లైసెన్సులను రద్దు చేస్తామని బెదిరిస్తూ ఉన్నారు. నిన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు వచ్చిన తర్వాత బాడీలను 24 వ తేదీన ఇస్తాం అంటూ కాలం గడుపుతూ ఒక్కోసారి ఒక్కో కారణం చూపి వాయిదా వేస్తున్నారు. మరోవైపు బంధువులను బెదిరించి ఆంధ్ర, ప్రదేశ్ తెలంగాణలకు శవాలను తీసుకెళ్తే శాంతి భద్రత సమస్య తలెత్తుతుందని కాబట్టి వాటిని ఇక్కడే ఖననం చేసుకోండి అని చెబుతున్నారు. మార్చురీలో ఉన్నటువంటి శవాలు ఏ రకమైన జాగ్రత్తలు తీసుకోనందువల్ల అవి పూర్తిగా కుళ్ళిపోయిన పరిస్థితికి చేరుకున్నాయి. ఇప్పటి వరకూ శవాలను అప్పజెప్తారని వేచి చూసిన బంధుమిత్రులకు నిరాశే ఎదురయింది. శవాలన్నిటిని మార్చురీలో గుట్టగా పడవేసి సిబ్బంది అందరూ ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. "మాకు శవాలను అప్పజెప్పండి, హైకోర్టు ఆర్డర్ కూడా ఉంది" అని %స్రా% ని అడిగితే ఆయన హైకోర్టు ఆర్డర్ ను చెత్త కాగితం లాగా పక్కన పడవేసి "ఇక్కడే మృతదేహాలను ఖననం చేసుకోండి" అంతకంటే మార్గం లేదని చెబుతున్నారూ ఇవి అన్నీ ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయి. ఛత్తీస్ ఘడ్ డీజీపీకి ఢిల్లీ నుంచి హోంశాఖ ఆదేశాలు ఇచ్చి ఉండాలి. డీజీపీ ఆదేశాలతోనే ఎస్పీ ఇలా వ్యవహరించే అవకాశం ఉంది. ఇలా జరగకుండా ఎస్పీ ఈ విధంగా వ్యవహరించే ధైర్యం చెయ్యలేడని కావాలనే ఉద్దేశంతో ఇలా ఇబ్బందులకు గురి చెయ్యడం సరైంది కాదని అన్నారు..

# శవాన్ని ఇవ్వలేం..

- మావోయిస్టు విజయలక్ష్మి శవం కుళ్ళింది
- బంధువులకు శవాన్ని అప్పజెప్పలేమని చేతులెత్తేసిన పోలీసులు
- అక్కడే అంత్యక్రియలు చేస్తామని తేల్చి చెప్పిన పోలీసు పోలీసు ఉన్నతాధికారి
- ఛత్తీస్ ఘడ్ లో విజయలక్ష్మి బంధువుల ఆవేదన - బూటకపు ఎన్కౌంటర్ కాబట్టే శవాన్ని అప్పజెప్పలేదు
- కేశంపేటకు చెందిన బంధువు ప్రేమ్ కుమార్ గౌడ్ ఆందోళన



రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం వేముల నర్వ గ్రామానికి చెందిన మావోయిస్టు విజయలక్ష్మి అలియాస్ భూమిక శవం పూర్తిగా కుళ్ళిపోయిందని ఈ పరిస్థితుల్లో శవాన్ని బంధువులకు అప్పజెప్పలేమని ఛత్తీస్ గడ్ ప్రభుత్వం అదేవిధంగా, పోలీసు శాఖ చేతులెత్తేసింది. అంతేకాదు భూమిక అంత్యక్రియలు జరుపబోతున్నట్లు పోలీసు అధికారి ఒకరు మృతురాలు విజయలక్ష్మి బంధువులకు తేల్చి చెప్పడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. భూమిక దూరపు బంధువు కేశంపేట మండలం కొండారెడ్డిపల్లి చెందిన ప్రేమ్ కుమార్ గౌడ్ ఇది అన్యాయమని శవాన్ని అప్పజెపుతామని చెప్పి అన్ని ఆధారాలు గుర్తింపు పత్రాలు తీసుకొని ఇప్పుడు కావాలని శవాన్ని బంధువులకు అప్పజెప్పడం లేదని ఇందులో పోలీసు శాఖ కుట్ర ఉందంటూ ప్రేమ్ కుమార్ గౌడ్ స్థానిక మీడియాకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. బూటకపు ఎన్కౌంటర్ చేసినందుకే శవాన్ని బంధువులకు అప్పజెప్పడం లేదని, బూటకపు ఎన్కౌంటర్ ఆనవాళ్లు గుర్తించే అవకాశం ఉంది కాబట్టి శవాలను బంధువులకు అప్పజెప్పడం లేదని ఇది దుర్మార్గపు చర్య అని ప్రేమ్ కుమార్ గౌడ్ మీడియాకు వెల్లడించారు. నిన్న మొన్న శవాన్ని అప్పజెప్తామని చెప్పి శవాన్ని ఫ్రీజర్ లో పెట్టకుండా కుళ్లిపోయేలా చేశారని ఒక పథకం ప్రకారం కుట్ర చేసి భూమిక శవాన్ని ఇతర మావోయిస్టుల శవాలను అప్పగించలేదని ప్రేమ్ కుమార్ గౌడ్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బూటకపు ఎన్కౌంటర్లు ఆపాలని ఇలా చివరిసారిగా కడసారి నివేదన కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం పూర్తి దుర్మార్గమని ప్రేమ్ కుమార్ గౌడ్ కన్నీటిపర్యంతమయ్యాడు. ఇది దుర్మార్గమైన చర్య అని ఏ ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని చనిపోయాక కూడా కర్కశంగా శవాలపై రాజకీయాలు చేయడం తగదని ప్రేమ్ కుమార్ గౌడ్ అదేవిధంగా భూమిక తండ్రి బాధితుడు సాయిల్ గౌడ్ తదితర బాధితులు నారాయణపూర్ ప్రాంతం నుండి స్థానిక మీడియాకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. దాదాపు శవం ఇచ్చే ప్రసక్తి లేదని చెబుతున్నారని ఇప్పటికే అంత్యక్రియలకు ఏర్పాట్లు కూడా అక్కడే చేశారని తెలిపారు. కనీసం తెలంగాణ నుండి తమ బంధువులను ఇక్కడికే చివరి చూపుల కోసం పిలుచుకుంటామని చెప్పినా కూడా వినడం లేదని మరి కొద్ది సేపట్లో శవాలను దహనం చేస్తున్నట్లు ఓ పోలీస్ అధికారి వచ్చి తమకు చెప్పాడని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

## కూటమి కొత్త అజెండా.. వైసీపీకి చెక్..!



వైసీపీ అధినేత జగన్.. కూటమి సర్కారుపై ఒత్తిడి తెచ్చే క్రమంలో జూన్ 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు రెడీ అయిన విషయం తెలిసిందే. 'వెన్నుపోటు' పేరుతో జూన్ 4న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేయడంతోపాటు.. కలెక్టరేట్లలో వినతి పత్రాలు కూడా ఇచ్చేందుకు ఆయన రెడీ అయ్యారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా.. ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నది జగన్ నిరసనల తాలూకు అజెండా. అయితే.. అదే రోజు.. కూటమి ప్రభుత్వం కూడా.. రెండు కార్యక్రమాలను ప్రకటించేందుకు రెడీ అయింది. దీనిలో ప్రధానంగా కూటమి పార్టీలు విజయం దక్కించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని.. పార్టీల తరఫున పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు రెడీ అయ్యారు. ఇది పార్టీల తరఫున చేపట్టనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారికంగా కూడా అదే రోజు.. "రాష్ట్రానికి విముక్తి" పేరుతో మరో కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కూడా రెడీ అయినట్టు తెలిసింది. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలైన.. టీడీపీ, బీజేపీ, జనసేనలు విజయం దక్కించుకున్నాయి. దీనిలో రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. ఒకటి.. జనసేన 21 స్థానాల్లో పోటీ చేసిన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ విజయం దక్కించుకుంది. ఇక, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి రెండూ గెలుచుకుంది. ఈ సందర్భానికి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో పార్టీ తరఫున గ్రామ గ్రామాన కార్యక్రమాలు, అన్నదానం కూడా నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు. ఇక, టీడీపీ విషయానికి వస్తే.. తొలిసారి 134 స్థానాల్లో విజయం దక్కించుకుంది. ఇది కూడా టీడీపీ పరంగా చూసుకుంటే రికార్డే. దీనిని పురస్కరించుకుని పార్టీ తరఫున కార్యక్రమాలు చేపడతారు. అదేవిధంగా ప్రభుత్వం మారి.. ఏడాది అవుతుంది కాబట్టి.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కూడా.. కార్యక్రమాలను నిర్వహించను న్నట్టు తెలిసింది. ఇవన్నీ. . కూడా వైసీపీ నిర్వహించే వెన్నుపోటు కార్యక్రమానికి కౌంటర్‌గానే నిర్వహి స్తున్నామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే క్లారిటీ రానుంది. ఈ రెండు పార్టీలు ఇలా వ్యూహాత్మకంగా కార్యక్రమాలు నిర్వహిస్తే.. వైసీపీ నిర్వహించే వెన్నుపోటు ఏమేరకు సక్సెస్ అవుతుందన్నది ప్రశ్నార్థకమే.

### వంశీ చనిపోతే కూటమి ప్రభుత్వం కూలిపోతుందన్న

## పేర్ని నానిపై కందుల దుర్గేశ్ ఫైర్

మనుషుల మరణాలతో రాజకీయ ప్రయోజనాలు ఆశించడం దారుణమన్న




దుర్గేశ్ పేర్ని నాని మాటలు అవివేకంగా ఉన్నాయని విమర్శ పవన్ సినిమా విడుదల సమయానికే కొందరు వివాదాలు సృష్టిస్తున్నారని మండిపాటు వైసీపీ నేత వల్లభనేని వంశీ మరణిస్తే కూటమి ప్రభుత్వం కూలిపోతుందంటూ మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర పర్యాటక, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజమండ్రిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సొంత పార్టీ సభ్యులు మరణించినా పర్వాలేదన్న ధోరణిలో వైసీపీ రాజకీయాలు చేయడం దారుణమని మండిపడ్డారు. మాజీ మంత్రి పేర్ని నాని మాటలు చాలా అవివేకంగా ఉన్నాయని, మనుషులు చనిపోవాలని కోరుకుంటున్నారా? అని మంత్రి దుర్గేశ్ ప్రశ్నించారు. ఒక వ్యక్తి మరణం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం హేయమైన చర్య అని ఆయన అన్నారు. ఏది పడితే అది మాట్లాడితే కుదరదని, ఎక్కడైనా తప్పు జరిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అంతేగానీ వ్యక్తులు చనిపోవాలని తాము కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. సినిమా థియేటర్ల బంద్‌ను కొందరు సినీ ప్రముఖులు తప్పుగా చిత్రీకరిస్తున్నారన్న ఆరోపణలపైనా కందుల దుర్గేశ్ స్పందించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సినిమా విడుదలయ్యే సమయానికే కొందరు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. వాస్తవానికి సినిమా హాళ్లు బంద్ పాటించడం లేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కొత్త సినిమాలు విడుదలైనప్పుడు టిక్కెట్ల ధరలు పెంచుకునేందుకు అనుమతిస్తామని హామీ ఇచ్చారు. అయితే, 'మా సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం' అని కొందరు సినీ పరిశ్రమ వ్యక్తులు చెప్పడాన్ని అహంకారపూరిత వైఖరిగా పరిగణిస్తామని అన్నారు. పవన్ సినిమా విడుదల కాకముందే, మానవత్వం లేకుండా ఆ సినిమా గురించి మాట్లాడటం పేర్ని నాని దుర్మార్గపు ఆలోచనకు నిదర్శనమని విమర్శించారు.

# మానవతా దృక్పథంతో ఆలోచించండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఎన్ కౌంటర్ మృతురాలు విజయలక్ష్మి శవాన్ని అప్పగించండి**

**కేంద్ర, ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి**



పోలీసు మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో మృతి చెందిన షాద్ నగర్ నియోజకవర్గ కేశంపేట మండలం వేముల నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి అలియాస్ భూమిక మృతదేహాన్ని అక్కడి ప్రభుత్వం మానవతా దృక్పథంతో వారి తల్లిదండ్రులకు బంధువులకు అప్పజెప్పాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్కౌంటర్లో తమ నియోజకవర్గానికి చెందిన విజయలక్ష్మి మృత్యుపాలైందని తమ ప్రాంతానికి చెందిన సాయిలు గౌడ్ తదితర బంధువులు శవం కోసం ఎదురుచూస్తున్నట్లు వస్తున్న సమాచారం తెలుసుకోవడం జరిగిందని అయితే అక్కడి ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచన చేసి శవాలను కన్నవారికి అప్పగించాలని తెలిపారు. చివరిసారిగా హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేసుకునే విధంగా అక్కడి ప్రభుత్వం అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే శంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని సైతం మీడియా ద్వారా కోరారు. నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది తప్ప శాంతిభద్రతల అంశంగా పరిగణించదని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ప్రకటించారని, దీనిని సామాజిక అంశంగా పరిగణించి మృతుల బంధువులకు శవాన్ని అప్పగించాలని కోరారు. తమ నియోజకవర్గానికి చెందిన యువతి మావోయిస్టు విజయలక్ష్మి చతిస్గడ్ రాష్ట్రంలో జరిగిన ఎన్కౌంటర్లో మృత్యుపాలైందని ఈ విషయం తెలుసుకుని దిగ్భ్రాంతికి గురయ్యానని ఎమ్మెల్యే విచారం వ్యక్తం చేశారు. శవం అప్పగింత కోసం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తాను స్వయంగా మాట్లాడినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏది ఏమైనా ఈ సంఘటన విచారకరమని యువత ఎన్నో చదువులు చదువుకొని హింసా మార్గంలో నడవవద్దని వాటి ఫలితాలు బాధాకరంగా ఉంటాయని ఏ పోరాటమైన ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ సూచించారు. విజయలక్ష్మి శవాన్ని కన్నవారికి అప్పజెప్పి చివరి చూపు బంధువులు చూసుకునే విధంగా అవకాశం కల్పించాలని తాను చతిస్ ఘడ్ ప్రభుత్వానికి అదేవిధంగా కేంద్ర ప్రభుత్వానికి కూడా ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వం జూనియర్ కళాశాల నిర్మాణానికి 11లక్షలు విరాళం అందించిన దేవశ్రీ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం



షాద్ నగర్ పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి ఫరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో ఉన్న దేవిశ్రీ ఇస్పత్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్ గోయంకా 11లక్షల రూపాయల విరాళాన్ని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాని ప్రకాష్ గోయంకా మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలో చదివే పేద పిల్లలకు ఉజ్వల భవిష్యత్తుకై నాణ్యమైన విద్య అందించాలానే ఉద్దేశ్యంతో కళాశాల నిర్మించడం గొప్ప విషయం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోముల బసప్ప తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని గాలికొదిలేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్**

**గురుకుల ఇంటర్ కళాశాల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**



తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే సకల సమస్యలతో కొట్టు మిట్టాడుతున్న విద్యా రంగాన్ని కాపాడలేక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలను అమలు చేస్తున్నారని దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం 2020 పేరుతో విద్యా కార్పొరేటీకరణ, విద్యాకేంద్రీకరణ, కాషాయి కరణ చేయాలని చూస్తుందని, విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం స్వాగతం పలుకుతోందని, పాలకులు ప్రపంచ బ్యాంక్ సలహాలపై ఆధారపడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అనే పద్ధతిలో విద్యావ్యాపారానికి పచ్చ జెండా ఊపయాని అన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని, కళాశాలలను మూసివేయడం కన్నా కళాశాలలను అభివృద్ధి చేసి నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, గురుకుల కళాశాలలో సరైన వసతులు కల్పించి నాణ్యమైన ఆహార భోజనాన్ని అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలో విద్యార్థులలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు వెంటనే ఈ పోస్టులను భర్తీ చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్షిప్ ఫీజుబకాయిలను విడుదల కాకపోవడం తో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలి టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి. తెలంగాణ రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని చెప్పినటువంటి ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి పనులు ప్రారంభించకపోవడం ఉన్నటువంటి గురుకులాలను బలోపేతం చేయకుండా కొత్తగా గురుకుల ఇంటర్ కళాశాలలో మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు డిమాండ్ చేసారు..

## బీసీల వాటా కోసం ధైర్యంగా పోరాడుదాం

**బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్**

**జిల్లేడు చౌదర్ గూడ మండలంలోని తుమ్మల పల్లి గ్రామంలో బీసీ సేన మహిళా కమిటీ ఏర్పాటు**

**బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మహిళ గ్రామ కమిటీల ఎన్నిక**

**అధ్యక్షురాలుగా చాకలి భారతమ్మకు నియామక పత్రాన్ని అందజేసిన జయ శ్రీకాంత్**




విద్య ఉపాధి రాజకీయ ఆర్థిక రంగాల్లో బీసీల వాటా దక్కేందుకు ధైర్యంగా పోరాటాలకు ముందడుగు వేయాలని బీసీ సేన మండల మహిళా అధ్యక్షురాలు ప్యాట జయ శ్రీకాంత్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదర్ గూడా మండలంలోని తుమ్మల పల్లి గ్రామంలో కమిటీ వేయడం జరిగింది. ఉపాధ్యక్షురాలు బంగారు నర్సమ్మ ప్రధాన కార్యదర్శి మారుగారు పద్మమ్మ కార్యదర్శి మారుగారు మమత కోశాధికారిగా బంగారు బాలమణిలను కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా బాధ్యత వహించి ప్యాట జయ శ్రీకాంత్. మాట్లాడుత భర్క కృష్ణన్న బాటలో నడుస్తూ ప్రతి గ్రామ గ్రామాన మహిళలందరూ చైతన్యం కావాలని గ్రామాలలో 40 నుండి 60 శాతం మన బీసీలే ఉన్నారు. కానీ మన బీసీలకు సరైన న్యాయం జరగట్లేదు కాబట్టి మహిళలందరూ ఏకమై మన హక్కుల కోసం పోరాడాలని
కృష్ణ న్న పిలుపుమేరకు గ్రామ కమిటీలు వేయడం జరుగుతుంది కనుక మనమందరం ఏకమై ముందుకు వచ్చి హక్కుల కోసం పోరాడాలని నా వంతు ప్రయత్నంగా ప్రతి గ్రామాన్ని వదలకుండా ప్రతిరోజు గ్రామాలు తిరుగుతూ కమిటీలు వేస్తూ నా వంతు బాధ్యత అనుకుని మన హక్కుల కోసం కలిసి పోరాడుదాం అని మన మహిళలందరి తరపున నేను మీకు అందుబాటులో ఉండి మీరు పిలిస్తే పలుకుతా అని మాట ఇస్తున్నాను మనకు రావాల్సిన వాటా సాధించుకోవాలన్నా ఆడ మగ అనే భేదం లేకుండా ప్రతి ఒక్కరు ధైర్యంగా ముందుకు రావాలని పోరాడాలని అప్పుడే సరైన న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి చెన్న బాల్ రాజు ప్యాటశ్రీకాంత్ మరియు గ్రామ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పాల్గొన్నారు.

## మొగిలి గిద్ద గ్రామంలో ని శ్రీ గోదా రంగనాయక స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవం ముగింపు



మొగిలిగిద్ద గ్రామంలోని శ్రీ గోదారంగనాయక స్వామి దేవాలయంలో సోమవారం బ్రహ్మోత్సవాల ముగింపు రోజు ఉదయం నుండి సుప్రభాత సేవ నిత్యారాధన మహా పూర్ణాహుతి కార్యక్రమం ముగించుకొని చక్రతీర్థం కార్యక్రమం ప్రారంభమైంది. నాలుగు వేదాలతో స్వామివారిని అభిషేకం చేస్తూ అవ బృత స్థానం చేయిస్తారు దీనిలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎస్టిఎస్ పురుషోత్తమాచార్యులు ఎస్ టి ఎస్ కేశవాచార్యులు చార్యులు ఎస్ టి ఎస్ రాజగోపాల్ చార్యులు గోపిచార్యులు పేద పండితులు ఎస్టిఎస్ రామాచార్యులు మారుతి మారుతి ఆచార్య శ్రీనివాస చార్యులు సునీల్ కుమార్ చార్యులు వేద పంటల మంత్రోచ్చల మధ్య ఈ కార్యక్రమం జరిగింది వీరుతోపాటు బడంగిపేట వెంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్తలు అర్చకులైన జగన్మోహన ఆచార్యులు కోహెడ దేవాలయం శ్రీనివాస చార్యులు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా చందు భార్గవ్ రోహిత్ కుమార్ శరన్ భరద్వాజ్ బొబ్బిలి రుచేందర్ రెడ్డి ,మెరుగు నర్సింలు గ్రామస్థులు,ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సిహెచ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు..

## నారాయణపూర్ ఎన్కౌంటర్ లో చనిపోయిన బహుజన బిడ్డ విజయ లక్ష్మి మృతదేహాన్ని కుటుంబానికి అప్పజెప్పాలి

**శ్రీకాంత్ గౌడ్ , అధ్యక్షులు, సర్వాయి పాపన్న గౌడ్ యువజన సంఘం**



ఈ నెల ఛత్తీస్గఢ్ నారాయణపూర్ లో జరిగిన ఎన్కౌంటర్ లో షాద్ నగర్ వేముల్ నర్వ గ్రామానికి చెందిన విజయలక్ష్మి గౌడ్ మృతి చెందటం బాధాకరం. ఒక బహుజన బిడ్డ పేద ప్రజల కోసం తాను నమ్మిన సిద్ధాంతం కోసం అన్నల బాట పట్టి గత 12 సంవత్సరాలుగా పనిచేసి అసువులు బాసి ఈ రోజు విగత జీవిగా మారిందని, ఈమె మరణం ఆదర్శం అన్నారు. ఇన్ని రోజులైనా శవాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా డబల్ ఇంజన్ సర్కార్ అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తుందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. చనిపోయిన తర్వాత దహన సంస్కారాలకు అవకాశం లేకుండా చేయటం దారుణమని, వెంటనే విజయలక్ష్మి మృతదేహాన్ని అక్కడే ఉన్న కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులుకూడా జోక్యం చేసుకోవాలని కోరారు.

# చటాన్ పల్లి రైల్వే గేట్ పైనుంచి వంతెన..

**నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేరిన వేళ**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు**

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు**

**షాద్ నగర్ తాలూకా జాయింట్ యాక్షన్ కమిటీ**



రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం చటాన్ పల్లి రైల్వే గేటు సమస్య చాలా ఏళ్లుగా, ఇక్కడి నియోజకవర్గ ప్రజలకు గుదిబండగా మారిందని, ఆరోగ్యపరంగా మరియు వ్యాపార పరంగా అత్యవసర పరిస్థితులలో ఎంతోమంది పలు రకాలుగా ఇబ్బందులు పడుతున్న వేళ షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని చటాన్ పల్లి రైల్వే గేట్ పై నుండి వంతెన నిర్మాణానికి ప్రభుత్వం దగ్గర నిధులు విడుదలయ్యే విధంగా సాధ్యమైనంత తొందరగా ఒత్తిడి తీసుకొచ్చి 814 కోట్ల రూపాయలను విడుదల చేయించడం జరిగింది. షాద్ నగర్ తాలూకా జాయింట్ యాక్షన్ కమిటీ తరపున పలుమార్లు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకోవడం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ఈ వంతెన నిర్మాణానికి 184 కోట్లు మంజూరు కావడం ఎంతో సంతోషకరమైన విషయం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు అదేవిధంగా ఈ వంతెన నిర్మాణం కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుఅభినందనలు. ఎమ్మెల్యేకు మా షాద్ నగర్ తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ మరియు నియోజకవర్గ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ షాద్ నగర్ తాలూకా చైర్మన్ ఎం.జనార్ధన్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్,కన్వీనర్ నక్క బాల్ రాజ్,గొర్ల రాము, అర్జునప్ప, మందారం నరసింహులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు..

# అర్హులందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**ఇందిరమ్మ ఇల్లు కు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**





షాద్ నగర్ నియోజకవర్గంలో విడుదలవారీగా నిరుపేదలు అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం బూర్గుల, కాశీ రెడ్డి గూడ, కడియాల గుట తండా లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీ లాల్, ఎంపిఓ జయంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరోజ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్,శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నాగయ్య గౌడ్,శేఖర్ గౌడ్,అర్జున్ రాజు నాయక్, లక్ష్మన్, నర్సింలు పరిశురాం, జగన్,అంజయ్య, చింటూ, రాజు,మల్లేష్, రాజు గౌడ్, మల్లేశ్,రాఘవేందర్ రెడ్డిమాధవ రెడ్డి, శివ కుమర్,లింగం, దర్శన్ గౌడ్,ఆంజనేయులు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో దాతల సహకారం తో నూతనంగా నిర్మింసున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటలను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ నటరాజ్,నేతలు చెంది తిరుపతి రెడ్డి,అగ్గనూర్ బస్వ%శీ%,శ్రీకాంత రెడ్డి, బలరాజ్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్, కొమ్ము కృష్ణ, నర్సింహులు, శ్రీనివాస్, రవితేజ, లింగారెడ్డి గూడ అశోక్ తదితరులు పాల్గొన్నారు..

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించాన్న బిసిసేన నేతలు

**చటాన్ పల్లి రైల్వే బ్రిడ్జ్ కు 184 కోట్ల రూపాయల మంజూరు పట్ల హర్షం**



చటాన్ పల్లి రైల్వే బ్రిడ్జ్ కు 184 కోట్ల రూపాయల మంజూరు చేసినందుకు షాద్ నగర్ బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్ర శేఖరప్ప ఆధ్వర్యంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రజలు ఈ పరిణామంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని శాశ్వత సమస్య తీరని వారు ఎమ్మెల్యేలు కొనియాడుతూ పూలమాలలు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ సదర్ శ్రీనివాస్ అసెంబ్లీ అధ్యక్షులు కత్తి చంద్రశేఖరప్ప టౌన్ బిసి సేన అధ్యక్షులు తంగిడిపల్లి శంకర్ అసెంబ్లీ కార్యదర్శి జూపల్లి చంద్రశేఖర్ అసెంబ్లీ కోశాధికారి చందూర్ లాల్ జమాల్పూర్ బాలరాజ్ నర్సింలు అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు భాస వరలక్ష్మి చౌదర్ గూడా మండల అధ్యక్షురాలు పేట జయ శ్రీకాంత్ ఫరూక్ నగర్ మండల అధ్యక్షురాలు జలజ ఫరూక్ నగర్ మండల ఉపాధ్యక్షురాలు స్రవంతి టౌన్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి మమత బాలమణి సరస్వతి సురిగి శారద తదితరులు పాల్గొన్నారు..

# ఆపరేషన్ సింధూర్ ని విజయవంతం చేసిన భారత సైనికులకు సెల్యూట్..

**ప్రపంచ దేశాలకు భారత శక్తిసామర్థ్యాలను చాటి చెప్పిన ఇండియన్ ఆర్మీ..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుదినెల్లి శ్రీవర్ధన్ రెడ్డి..**

**షాద్ నగర్ పట్టణం లో నిర్వహించబోయే తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి..**

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జి అందే బాబయ్య..**





భారత ప్రధాని మోడీ సమర్థ నాయకత్వములో ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేసిన భారత సైనిక దళాలకు వందనం తెలుపుతు 28 మే బుధవారం నాడు షాద్ నగర్ పట్టణం లో నిర్వహించబోయే తిరంగా ర్యాలీకి సంబంధించిన ప్రిపరేషన్ మీటింగ్ బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జి అందే బాబయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యం అతిధిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి వెంకటేష్ గుప్త, ప్యాట అశోక్,వంశీ కృష్ణ,మల్చలం మురళి,ఇసునాతి శ్రీనివాస్,మోటే శ్రీను,పట్టణ అధ్యక్షులు హరి భూషణ్, పిట్టల సురేష్, రాధికా, లక్ష్మీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి,ఎదిర రాజు,రణధీర్ గౌడ్ మరియు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ని విజయవంతం చేసిన భారత సైనికులకు అభినందనలు తెలుపుతూ 28 నాడు షాద్ నగర్ లో జరగబోయే తిరంగా ర్యాలీ లో పార్టీలకు మతాలకు అతీతంగా పెద్ద సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని, సైనికులకు ఆత్మ స్థర్యాన్ని నింపాలని అన్నారు.పహల్గామ్ దాడికి దీటైనా చర్యగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారత సైన్యం పాక్ లోని ఉగ్రవాదుల 9 స్థావరాలపై దాడి చేసి, చాలా మంది ఉగ్రవాదులను మట్టుపెట్టిందని అన్నారు.వీర వనితలు పుట్టిన నేల భారతదేశం అని, ఆపరేషన్ సింధూర్ లో తొలిసారి ఆర్మీ మహిళలు పాల్గొని త్రివిద దళాల సాక్షిగా మిస్సైళ్ల రూపంలో దూసుకెళ్లి ఉగ్రమూకలను మట్టుబెట్టారని అన్నారు.ఇప్పటికైనా భారత్ పై పాక్ తీవ్రవాద దాడులను ఆపాలని అన్నారు. భారత్ మిస్సైల్ల ముందు పాకిస్తాన్ అమెరికా చైనా మిస్సైళు పని చేయలేదని,భారత్ శక్తి వంత మైన దేశంగా నిలిచించని అన్నారు.ఈ సందర్భంగా అందే బాబయ్య మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయవంతం ప్రపంచానికి భారత్ శక్తి సామర్థ్యాలు ఎంత గొప్పవని తెలిసిందని,అదే కాకుండా శత్రు దేశాల మిస్సైల్ అన్ని రకాల దాడులను భరత్ సమర్తవంతముగా తిప్పి కొట్టి ప్రపంచానికి మన శాస్త్ర సాంకేతిక ఆయుధాల శక్తిని చూపిందని దేశమంత ఒక్కటి గా ఐక్యత ప్రదర్శిందని అన్నారు.28నాడు షాద్ నగర్ పట్టణం లో అంబెడ్కర్ విగ్రహం నుండి శివాజి విగ్రహం వరకు ర్యాలీ ఉంటుంది.అదేవిదంగా తిరిగి అంబెడ్కర్ విగ్రహం వద్ద సభ ఉంటుంది ఇందులో భాగంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమం లో జె నర్సింహా బోయ కుర్మయ్య,రొళ్ళ రఘురామ్ గౌడ్,బోయ శంకర్,కంచుకోట నర్సింలు, మహేష్ ,మిద్దె గణేష్ హన్మంత్ శ్రీనివాస్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బాల సాహిత్య ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ప్రవీణ్ శర్మ

తెలుగు వెలుగు(ఎయిర్ గట్ల మండ లం) ఏ ర్గట్ల. నిజామాబాద్ జిల్లాబాల సాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్న బాల సాహితీవేత్తలకు మరియు ఉపాధ్యాయులకు తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ వారు సత్కారాలు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో బాల సాహిత్యములో విశేషమైన కృషి చేస్తూ విద్యార్థుల చేత అనేక ప్రక్రియలలో పుస్తకాలను ప్రచురింప చేస్తూ, సాహిత్య రంగంలో విద్యార్థులు అనేక పోటీలలో విజయాలు సాధించే విధంగా వారిలో ఉన్న సృజనాత్మకను నైపుణ్యాన్ని, ప్రతిభను బయటకు తీస్తూ, రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో చక్కని గుర్తింపును విద్యార్థులు అందుకునే విధంగా కృషి చేస్తున్న ఏరుగట్ల ఉన్నత పాఠశాలలో తెలుగు పండితులుగా పనిచేస్తున్న శ్రీ ప్రవీణ్ శర్మ బాల సాహిత్య ఉపాధ్యాయ పురస్కారం హైదరాబాదులోని తెలంగాణ సారస్పద పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం జరిగిన పురస్కార సభలో పరిషత్ అధ్యక్షులు శ్రీ ఎల్లూరి శివారెడ్డి, శాంతాబయోటిక్ స్థాపకులు పద్మ విభ భూషణ్ గ్రహీత శ్రీ వరప్రసాద్ రెడ్డి, నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ భారత ప్రాంతాధికారి శ్రీ పత్తిపాక మోహన్ పరిషత్ కార్యదర్శి శ్రీ చెన్నయ్య మరియు కార్యక్రమ నిర్వాహకులు శ్రీ గరిపెల్లి అశోక్ గారి చేతుల మీదుగా నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం శాలువను అందుకున్నారు.ఈ సందర్భంగా ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులచే అనేక ప్రక్రియలలో పుస్తకాలను ఆవిష్కరించినందుకు, మరియు బాలసాహిత్యంలో విశేషమైన కృషి చేస్తున్నందుకు ఈ సత్కారాన్ని అందుకున్నానని తెలిపాడు.




## కూకట్ పల్లీ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో విజయవంతంగా తిరంగా యాత్ర నిర్వహణ : వడ్డేపల్లి రాజేశ్వరరావు

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**



దేశ రక్షణ కోసం సాహసోపేతంగా నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగిసిన సందర్భంగా, దేశవ్యాప్తంగా సైనికుల పట్ల సంఘీభావంగా భారతీయ జనతా పార్టీ తిరంగా యాత్రలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, ఈరోజు కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ డివిజన్ లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన తిరంగా యాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి,అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్శనపల్లి సూర్యరావు,జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య,జిల్లా కార్యదర్శి తూము శైలేష్ కుమార్,నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్ రావు,రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయ భవాని,మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచేర్ల మహేందర్ మరియు నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు మరియు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు. దేశ భక్తి నినాదాలతో, జాతీయ జెండాలతో పాల్గొన్న యువత మరియు బీజేపీ కార్యకర్తలు యాత్రను ఉత్సాహంగా నిర్వహించారు. దేశ భద్రత కోసం ప్రాణాలను త్యాగం చేసిన సైనికుల సేవలను స్మరించుకుంటూ, ప్రతి పౌరుడు తమ దేశభక్తిని చాటుకోవాలనే ఉద్దేశంతో బీజేపీ తిరంగా యాత్రను నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా సోమవారం కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తరంగయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం, దేశ భద్రతపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందనీ నేతలు ప్రజలకు గుర్తు చేశారు.

## కూకట్పల్లి ఏసీపి రవి కిరణ్ రెడ్డికి అభినందనల వెలువ...

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి**

కూకట్పల్లి నూతన ఏసిపిగా బాధ్యతలు తీసుకున్న రవి కిరణ్ రెడ్డిని కూకట్పల్లికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సోమవారం ఎసిపి కార్యాలయంలో రవి కిరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్,అరవింద రెడ్డి ఫణీంద్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల మైకేల్, రేష్మ,దేవ సహాయం, రవి, శేషగిరి నాయుడు, రాజు ముదిరాజ్ ,రామకృష్ణారెడ్డి,ప్రసాద్. కొమ్ము బాబు పాల్గొన్నారు.



# తెలంగాణా రాష్ట్ర నూకాంబిక అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ...



తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి

తెలంగాణా రాష్ట్ర నూకాంబిక అమ్మవారి ఉత్సవాల పోస్టర్ ను హైదరాబాద్ లోని క్యాంప్ కార్యాలయంలో లోక్ సభ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ సోమవారం ఆవిష్కరించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు నూకాంబిక అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఎంపీ రమేష్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. జూన్ 15వ తేదిన కూకట్ పల్లి అయ్యప్ప స్వామి, చిత్తారమ్మ ఆలయంలో నిర్వహించే నూకాంబిక అమ్మవారి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా అనకాపల్లి ఎం.పీ. డాక్టర్ సి.ఎం.రమేష్, అతిథిగా దాడి రత్నాకర్ హాజరవుతారని, కర్రి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఉత్సవ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ రాష్ట్రాల కళాకారులతో కోలాటాలు, నృత్య ప్రదర్శనలు, లలితా సహస్ర నామ పారాయణం, సంకీర్తనలు, మొదలైన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నందున జంట నగరాలలోని భక్తులు నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి కృపా కటాక్షాలను, ఆశీర్వాదాలను పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్ జిల్లా పేరు మార్చుతూ కూటమి సర్కార్ జీవో

పాలకులు తీసుకున్న నిర్ణయాలకు ప్రజామోదం దక్కితే ఇక వాటికి తిరుగు ఉండదు. తర్వాత ఏర్పడే ప్రభుత్వాలు ఆ నిర్ణయంపై సమీక్ష చేసే అవకాశం కూడా ఉండదు. ప్రజామోదంతో తీసుకున్న నిర్ణయాలను కదిలిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని తర్వాత ప్రభుత్వాలు వాటి జోలికి వెళ్లవు. జిల్లా పేరు మార్చుతూ నాడు జగన్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదం కావడంతో.. కూటమి ప్రభుత్వం ప్రజామోదం మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. వైసీపీ హయాంలో వైఎస్సార్ కడప జిల్లా పేరును పూర్తిగా మార్చేశారు. తన తండ్రి పేరు మాత్రమే ఉండాలని అహంభావంతో జిల్లా పేరులో కడప అనే పదాన్నే తొలగించారు. దీనిపై అప్పట్లోనే ప్రజా సంఘాలు అభ్యంతరం తెలిపాయి. వైఎస్సార్ కడప జిల్లాగా కొనసాగించాలని, కడప అనేది ప్రజల భావోద్వేగానికి సంబంధించినది అని నినదించారు. కానీ, జగన్ వినలేదు. ప్రభుత్వం మారాక ప్రజల అభిప్రాయం గౌరవిస్తూ వైఎస్సార్ కడప జిల్లాగా మార్చారు. గతంలోనే , చంద్రబాబు ప్రతిపక్ష నేత హెూదాలో కడప జిల్లాలో పర్యటించిన సమయంలో తాము అధికారంలోకి వస్తే జిల్లా పేరును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అంశంపై మంత్రి సత్యకుమార్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ప్రజల నుంచి




ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందటంతో వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మార్చుతూ జీవో జారీ చేశారు.

# కేబినెట్ విస్తరణకు.. రాహుల్ ఆమోదమే తరువాయి

**రేపు (మే 27) పీసీసీ కార్యవర్గం ఖరారు..!!**

**పీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు! = వర్కింగ్ ప్రెసిడెంట్లుగా ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే?**

**దాదాపు కొలిక్కి వచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గం**

హైదరాబాద్: రాష్ట్ర కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. రేపు క్లారిటీ వస్తుందని అందరూ భావించారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిజీబిజీగా ఉండటంతో మంత్రి వర్గ విస్తరణ రేపు ఉండకపోవచ్చని తెలుస్తోంది. పీసీసీ కార్యవర్గంపై ఇప్పటికే ఒక క్లారిటీ ఉంది. పీసీసీ కార్యవర్గాన్ని ఫైనల్ చేసే అవకాశం ఉంది. ఢిల్లీలో రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బిజీబిజీగా గడుపుతున్నారు. మంత్రివర్గ విస్తరణ, పార్టీ పదవులపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. దీంతో రేవంత్, మహేశ్ కుమార్ వరుసగా కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ అవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉన్నాయి. కొత్తగా మంత్రివర్గంలో చోటుదక్కించుకునే ఆ లక్కీ సిక్స్ హ్యాండ్స్ ఎవరనే చర్చ నడుస్తోంది. రేసులో వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంకటస్వామి, రాజగోపాల్ రెడ్డి, పీ సుదర్శన్ రెడ్డి పేర్లు వినిపిస్తుండగా ప్రస్తుతం ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి పేరు కూడా తెరమీదకు వచ్చింది. మున్నూరు కాపు సామాజిక వర్గం నుంచి తనకు కేటాయించాలని ఆమె అధినాయకత్వాన్ని కోరుతున్నట్టు సమాచారం. మూడు రోజుల క్రితం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రధాన మంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయుగ్ సమావేశంలో పాల్గొన్నారు. తర్వాత రాష్ట్రానికి నిధులు రాబట్టేందుకు ప్రధాని, మంత్రులను కలుస్తున్నారు. నిన్న (%మీుఎ%




25) సాయంత్రం కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ని వీరు కలిశారు.సుమారు గంట పాటు చర్చలు జరిపారు. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించినట్లు సమాచారం. అయితే రాష్ట్ర కేబినెట్ పై ఇప్పటికే ఒక క్లారిటీ వచ్చినప్పటికీ రాహుల్ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. ఆయన వచ్చి ఫైనల్ చేస్తేనే లక్కీ సిక్స్ ఎవరనేది తేలుతుంది.

# మళ్లీ ఫార్ములా - కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు !




భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరోసారి ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫార్ములా ఈ రేసు కేసులో 28వ తేదీన తమ ఎదుట హాజరు కావాలని నోటీసుల్లో ఆదేశించారు. గతంలో ఓ సారి ఏసీబీ ఈ కేసు అంశంలో ప్రశ్నించింది. అప్పట్లోనే మరోసారి పిలుస్తారని ప్రచారం జరిగింది కానీ ఎలాంటి నోటీసులు రాలేదు. కానీ హఠాత్తుగా ఇప్పుడు మరోసారి నోటీసులు జారీ చేసింది. పెద్దగా సమయం కూడా ఇవ్వకుండా.. రెండు రోజుల్లోనే తమ ఎదుట హాజరు కావాలని ఆదేశించడం హాట్ టాపిక్ గా మారింది. నిజానికి ఈ కేసులో కేటీఆర్ ను ఎప్పుడో అరెస్టు చేస్తారని అనుకున్నారు. కేటీఆర్ కూడా మెంటల్‌గా ప్రిపేరయ్యారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు ఆయన ఇంటికి వస్తున్నారని క్యాడర్ ను కూడా సమీకరించారు. కానీ అరెస్టులు జరగలేదు. ఆ కేసు సైలెంట్ అయిపోయిది. అదో లొట్టపీసు కేసు అని కేటీఆర్ ఎగతాళి చేసేవారు. ఇప్పుడు ఆ కేసులో మరోసారి కదలిక ప్రారంభమయింది. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్ పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవడానికి గవర్నర్ అనుమతి కూడా లభించింది. ఎన్నికలకు ముందు ఫార్ములా ఈ రేసు కంపెనీకి ఎలాంటి అనుమతులు లేకుండా యాభై కోట్లు బదిలీ చేశారు. అది నిబంధనలకు విరుద్ధమని కేసు నమోదు అయింది. తాము డబ్బులు పంపామని కేటీఆర్ అంటున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా పంపడం నేరమని కేసులు పెట్టారు. ఈ కేసులో కేటీఆర్ ను అరెస్టు చేయడానికి అవకాశం ఉంది. కానీ వేడి పూర్తిగా తగ్గిపోయిన తర్వాత ఇప్పుడు హఠాత్తుగా నోటీసులు జారీ చేసి ఏసీబీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## జిన్నారం మండల కేంద్రంలో జీలుగులు పంపిణీ చేసిన ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి



సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయంలో రైతులకు రవీంద్రనాథ్ రెడ్డి తో కలిసి జీలుగులు పంపిణీ చేసిన ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి. జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ వైస్ ఎంపీపీ గంగ రమేష్. ఆత్మ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు పంట దిగుబడి ఎక్కువగా రావడానికి జీలుగులు రైతులకు మరింత దోహదపడతాయని మండల కేంద్రంలో వివిధ గ్రామాలలో ఉండే రైతులందరూ ఈ జీలుగులు సద్వినియం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మాజీ ఎమ్మెల్యే “సత్తి”ని మర్యాదపూర్వకంగా కలిసిన మార్తి లక్ష్మి



**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**
తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి అనపర్తి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.సోమవారం అనపర్తి వైసిపి కార్యాలయంలో కలిసిన జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన లక్ష్మిని మాజీ ఎమ్మెల్యే సత్తి అభినందించారు.అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరిగిన కక్ష సాధింపు,పార్టీ బలోపేతం చేయడం, భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించినట్టు మాజీ ఎమ్మెల్యే సత్తి చెప్పారు. ఈ కార్యక్రమంలో కొవ్వోలు అనురాధ, కృష్ణవేణి, బొంతుమణి, మార్తి నాగేశ్వరరావు, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## పోర్ష్ ఈవెంట్‌లో డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):**
ప్రముఖ కార్ బ్రాండ్ పోర్ష్ (పి వో ఆర్ ఎస్ సిహెచ్ వి) గ్రేటర్ నోయిడాలో నిర్వహించిన ప్రత్యేక ఈవెంట్‌లో అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతుల కుమారుడు రాజమహేంద్రవరం గౌతమ్ యూరాలజీ కిడ్నీ సెంటర్ అధినేత డాక్టర్ సత్తి గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు. ఈవెంట్‌లో పోర్ష్ సంస్థ తన తాజా మోడల్స్‌ను ప్రదర్శించింది.

## కేటీఆర్ కు ఏసీబీ నోటీసులు.. కవిత స్పందన



తన సోదరుడు కేటీఆర్తో విభేదాలు వచ్చాయంటూ జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో కవిత సంచలన ట్వీట్ చేశారు. కేటీఆర్కు ఏసీబీ నోటీసులపై తీవ్రంగా స్పందించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని కవిత ఆరోపించారు. %ూజదీ% నోటీసులు జారీ చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరెన్ని ఇబ్బందులు పెట్టినా తట్టుకొని నిలబడ్డ చరిత్ర %ఖజ=% సైనికులదని స్పష్టం చేశారు.

# అంత్యక్రియలు పూర్తి..

**మావోయిస్టుల సంచలన లేఖ.. ఎందుకంటే..**

**కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు మావోయిస్టులు ఇటీవలే లొంగిపోయారు**

**ద్రోహులు ఇచ్చిన సమాచారం మేరకే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్**

**35మంది ప్రాణాలు అడ్డుపెడితే ఏడుగురం సురక్షితంగా బయటపడ్డామని లేఖ**

**పాకిస్థాన్‌తో చర్చలు జరిపినప్పుడు తమతో చర్చలు జరిపితే తప్పేంటని ప్రశ్న**

**ఎనిమిది మంది నక్సలైట్ల మృతదేహాలకు భద్రతా బలగాలు అంత్యక్రియలు**

ఛత్తీస్‌గఢ్: మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు తొలిసారిగా సంచలన లేఖ విడుదల చేశారు. లొంగిపోయిన ద్రోహులు ఇచ్చిన సమాచారం మేరకే నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పారు. 6నెలలుగా మాడ్ ప్రాంతంలోనే నంబాల ఉన్నట్లు ప్రకటించారు. కేశవరావు టీమ్‌లో ఉన్న ఆరుగురు మావోయిస్టులు ఇటీవలే లొంగిపోయారని మావోయిస్టులు లేఖలో తెలిపారు. వారు ఇచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్ జరిగిందని చెప్పుకొచ్చారు. కేశవరావును సురక్షిత ప్రాంతానికి తరలిస్తామంటే ఆయన ఒప్పుకోలేదని అన్నారు. కేశవరావు కోసం 35మంది ప్రాణాలు అడ్డుపెడితే ఏడుగురం సురక్షితంగా బయటపడ్డామని తెలిపారు. 27మంది ఎన్ కౌంటర్‌లో చనిపోయారని చెప్పారు. పాకిస్థాన్‌తో చర్చలు జరిపినప్పుడు తమతో చర్చలు జరిపితే తప్పేంటని ప్రశ్నించారు. స్పెషల్ జోనల్ కమిటీ వికల్ప్ పేరుతో ఈ లేఖను మావోయిస్టులు విడుదల చేశారు.

**అంత్యక్రియలు పూర్తి..**

కాగా, మావోయిస్టు చీఫ్ నంబాల కేశవరావు అంత్యక్రియలు ఇవాళ(సోమవారం) సాయంత్రం పూర్తి అయ్యాయి. మాడ్ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబర్ల కేశవరావు చనిపోయిన విషయం తెలిసిందే. కేశవరావు మృతదేహాన్ని అప్పగించాలంటూ బలగాలని కుటుంబ సభ్యులు కోరారు. కేశవ్‌రావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకుండా భద్రతా బలగాలు అంత్యక్రియలు పూర్తిచేశారు. అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన నక్సలైట్లకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగు రోజులుగా మృతదేహాన్ని అప్పగించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నక్సల్ చీఫ్ బసవ రాజుతో సహా ఎనిమిది మంది నక్సలైట్ల మృతదేహాలను భద్రతా బలగాలు అంత్యక్రియలు పూర్తి చేశారు.

# ప్రణాళికా బద్ధంగా కాలనీల అభివృద్ధి

**ప్రతి బస్తి కాలనీలలో అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి**

**పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**





**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నల్లగండ్ల గ్రామం లో రూ 40.00 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఈ రోజు కాలనీ వాసులు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు. గచ్చిబౌలి డివిజన్ లో ప్రణాళిక బద్దంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. గచ్చిబౌలి డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు. అదేవిధంగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా వారి సహాయ సహకారాలు ఉంటాయని కాలనీ వాసులకు తెలపటం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వసంత కుమార్ యాదవ్,గిరి,రమేష్, రంగస్వామి,చంద్రశేఖర్, సాయి కుమార్, క్రాంతి, శ్రీధర్, దిలీప్, శ్రీనివాస్, విజయ్, వినయ్ మల్లికార్జున,పండు, రమేష్, వెంకట్, చంద్రశేఖర్, సాయి కుమార్, క్రాంతి, శ్రీధర్, దిలీప్, శ్రీనివాస్, విజయ్, వినయ్,వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, నల్లగండ్ల గ్రామం వాసులు,స్థానిక నేతలు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోత్కుపల్లిలో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మే 27 తెలుగు వెలుగు:**

గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మోత్కుపల్లి గ్రామం కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం కోట్ పల్లి మండలం, మోత్కుపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో అండర్ డ్రైనేజీ పనులను గ్రామ నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఖాజా పాషా, దుర్గంచెర్వు పాండు, మల్ల నర్సింలు, ప్రమోద్ కుమార్, బాబు, శ్రీకాంత్, రాములు, ఆనంద్, రామచంద్రయ్య, మల్లయ్య, శ్రీనివాస్, మహేష్ తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# అమెరికా వెళ్లేముందు నిబంధనలు స్టడీ చేయాలి !

అమెరికా చదువులు..డాలర్ కలలు కల్లలవుతున్నాయి. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కకపోవడంతో చాలామంది అమెరికా తదితర దేశాలవైపు చూస్తున్నారు. ఉన్నత చదువులు చదువుకుని..అక్కడే ఏదో ఉద్యోగం చేసుకుని స్థిరపడాలన్న కాంక్ష ఏటేటా పెరుగుతోంది. దీనికితోడు దేశంలో దారుణంగా పరిస్థితులు ఉంటున్నాయి. ఏటా దాదాపు రెండున్నర లక్షలమంది ఉన్నత చదువులకు అమెరికాకు వెళుతున్నట్లు తెలుస్తోంది. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సాయం అందడం లేదు, బ్యాంకులు సులువుగా రుణాలు ఇవ్వడం లేదు. నిజానికి ఇది కూడా ఓ ప్రహసనం గా మారింది. ఫీజులకు అసవరమైన మొత్తాన్ని, ఇతరత్రా ఖర్చులను బ్యాంకులు నేరుగా ఇచ్చివుంటే విద్యార్థులకు బాధలు తప్పేవి. ప్రభుత్వ విధానాలు, బ్యాంకుల సక్రమంగా పనిచేసివుంటే..బ్యాంకు రుణాల కోసం, చదువుల ఖర్చులు కోసం అడ్డదారులు తొక్కాల్సిన అవసరం వచ్చేది కాదు. ఈ విషయంలో కేంద్రం తీరు దారుణంగా ఉంది. విదేశాల్లో చదివేందుకు వెళ్లే విద్యార్థులకు ఉదారంగా రుణాలు ఇచ్చే పథకాలు రావాల్సి ఉంది. అలాగే ప్రభుత్వ పరంగానే కన్సల్టెన్సీ సాయం అందాలి. వారికి అమెరికా నిబంధనల మేరకు అసవరసమైన ఆర్థిక సాయం, టెక్నికల్ సాయం అందాలి. సులువుగా అమెరికా వెళ్లి చదువుకుని వచ్చేలా చూడాలి. కానీ అలాంటి ప్రయత్నం జరగడం లేదు. ఇకపోతే నానాతంటాలు పడి వీసా సంపాదించి ..అమెరికా లాంటి దేశాలకు వెళ్లే క్రమంలో అమెరికా వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ విధానాలు తెలుసు కోక పోవడం వల్ల చాలామంది మోసపోతు న్నారు. దీనికితోడు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చిన కన్సల్టెంట్లు కూడా వీరి ఆత్రుతను సొమ్ముచేసుకుని సరైన గైడెన్స్ ఇవ్వడం లేదు. విదేశీ చదువుల కోసం ఎన్నో కలలు.. వాటిని సాకారం చేసుకొనేందుకు ఎన్నో రోజుల కష్టం.. వీసా వచ్చిందని విదేశాల్లో వాలిపోయినా, అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అడిగే ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పలేక ఎయిర్‌పోర్టు నుంచే స్వదేశానికి తిరిగుటపా కట్టాల్సి రావడం ఎంతగా కుంగదీస్తుందో అర్థం చేసుకోవాలి. గత వారం అమెరికాలో ఈ పరిస్థితే ఎదురై 21మంది విద్యార్థులను తిరిగి పంపారు. అయితే విదేశీచదువులకు వీసా ఒక్కటే ఎంట్రీకార్డు కాదని, ఇమ్మిగ్రేషన్ ఇంటర్వ్యూ కూడా గట్టెక్కాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు ముందే గుర్తించడం లేదు. కన్సల్టెంట్లు కూడా చెప్పడం లేదు. దీంతో విదేశాల్లో చదువులు,ఉద్యోగాలకోసం ఎన్నో కలలు కని, వాటిని సాకారం చేసుకొనేందుకు ఎంతో కష్టపడి తీరా అవకాశం లభించాక కొందరు చేజేతులా వాటిని కోల్పోతున్నారు. గతవారం అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన భారతీయ విద్యార్థులు చిన్నచిన్న పొరపాట్ల కారణంగా, అవగాహన లేమితో స్వదేశం రావాల్సిన దుస్థితి ఏర్పడింది. వివిధ యూనివర్సిటీల్లో అడ్మిషన్లు లభించి వాటిలో చేరేందుకు శాన్‌ఫ్రాన్సిస్కో, షికాగో, అట్లాంటా విమానాశ్రయాల్లో వారిని రిటర్న్ ఫ్లయిట్‌లు ఎక్కించారు. వీరిలో ఎక్కువమంది తెలుగువారు ఉన్నట్టు తెలుస్తున్నది. సరైన పత్రాలు లేకపోవడం వల్లనే వారిని తిప్పి పంపుతున్నట్టు ఇమ్మిగ్రేషన్ అధికారులు చెప్తున్నప్పటికీ కారణాలు వేరుగా ఉన్నట్టు సమాచారం. ఇలా జరిగిన వారికి కనీసం మరో ఐదేళ్ల పాటు అమెరికాలో ప్రవేశించే అవకాశం లేదు. సాధారణంగా అమెరికాలో ప్రవేశించాక అక్కడి ఇమ్మిగ్రేషన్ అధికారులు విద్యార్థులను పేరు, తలిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, ఏ వర్సిటీలో ఏ కోర్సు చదవబోతున్నారు, ఎక్కడ ఉంటారు వంటివిషయాల్లో ఆరా తీస్తారు. ఆర్థిక స్థితిగతులు,ఆదాయ వనరులు, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ వంటి వాటిపైనా ప్రశ్నలేసి ఆరా కూపీ లాగుతారు. అవసరమైతే అకౌంట్లు తీసి చూస్తారు. వాటికి ఓపికగా సమాధానాలు చెప్పాలి. ఈ ప్రశ్నలకు సమాధానాలివ్వని కారణంగానే విద్యార్థులను వెనక్కిపంపినట్లుగా తెలుస్తున్నది. విద్యార్థులను గంటల తరబడి కూర్చుండబెట్టి అడిగినా వారి నుంచి సమాధానాలు రాకపోవ డంతోనే వారిని తిప్పిపంపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో అమెరికా వెళ్లే విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపునులు సూచిస్తున్నారు. అమెరికా కోసం ఎంతోకొంత రుణం తీసుకుని ఆ తరవాత బ్యాంకుల్లో బ్రోకర్ల ద్వారా డబ్బులు జమచేయడం...వీసా రాగానే బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేయడం వంటివి జరుగుతున్నాయి. వెనక్కి రావడానికి కారణాలివే.. ఓ విద్యార్థినిని.. మీరు చదివే కాలేజీలో ఫీజు రూ. 30 లక్షలవుతుంది. అంత మొత్తాన్ని ఎలా సంపాదిస్తారని అడిగినట్లు సమాచారం. అందుకు పార్ట్‌టైమ్ జాబ్‌చేసి సంపాదిస్తానని చెప్పడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆ విద్యార్థిని అనర్హురాలిగా ప్రకటించారు. అమెరికా నిబంధనల ప్రకారం పార్ట్‌టైం జాబ్స్‌ను అనుమతించరు. కేవలం పోస్ట్ స్టడీ వర్క్ వీసాలు మాత్రమే ఇస్తారు. ఈ సమయంలో మాత్రమే పనిచేసి సంపాదించుకోవాలి. మరో విద్యార్థిన్ని ÷నాన్షియల్ ప్రూఫ్స్, ఆథరైజేషన్ లెటర్లు, లోన్ డాక్యుమెంట్లు అడుగగా.. తన వద్దలేవని చెప్పడంతో వెనక్కి పంపించారు. బ్యాంక్ నిల్వను చూపించని వారికి ఇదే పరిస్థితి తలెత్తింది. ఉన్నత విద్య కోసం అమెరికాకు క్యూ కడుతున్న ఇండియన్ స్టూడెంట్స్‌కు విద్యార్థులకు అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు ఇలా కూపీ లాగా షాక్ ఇస్తున్నారు. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేకపోవడం, సోషల్ మీడియా పోస్టులు, బ్యాంకు ఖాతా లావాదేవీలు కూడా ఇమ్మిగ్రేషన్ అధికారులు చెక్ చేస్తారని గుర్తించాలి.

## పూర్తి స్థాయి డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా



రాష్ట్ర డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవాల్టి నుంచి రెండేళ్ల పాటు ఆయన డీజీపీగా కొనసాగనున్నారు. ఇప్పటివరకు ఆయన ఇన్చార్జ్ డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే.

## ఎమ్మెల్సీ కవితతో ఎంపీ దామోదర్ కీలక భేటీ



ఎమ్మెల్సీ కవితతో నేత, ఎంపీ దామోదర్ రావు సమావేశమయ్యారు. కవిత నివాసంలో జరిగిన ఈ భేటీలో ఆ పార్టీ లీగల్ సెల్ ఇన్చార్జ్, న్యాయవాది గండ్ర మోహన్ రావు కూడా పాల్గొన్నారు. కేసీఆరు ఆమె రాసిన లేఖ బయటకు రావడం, దానిపై ఆమె వ్యాఖ్యలు, తదనంతర పరిణామాలపై 2 గంటలపాటు చర్చించినట్లు సమాచారం.

## తెలుగు రాష్టాలను తాకిన నైరుతి రుతుపవనాలు..

13 రోజులు ముందుగానే తెలంగాణలోకి ఎంట్రీ మహబూబ్ నగర్ వరకు



విస్తరించినట్లు వాతావరణ శాఖ వెల్లడి ఏపీలోని రాయలసీమను తాకిన నైరుతి రుతుపవనాలు కేరళ, కర్నాటక, తమిళనాడులో పూర్తిగా విస్తరించిన రుతు పవనాలు మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాల్లో విస్తరణ దక్షిణాదితో పాటు మహారాష్ట్రలో దంచికొడుతున్న వర్షాలు...

## పోస్ట్‌మాష్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఐపిఓకి ఫిర్యాదు



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట**

మండలంలోని ఆసుపాక పోస్ట్ మాష్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ పాల్వంచ పోస్టల్ సర్కిల్ ఐపిఓకి ఆసుపాక ప్రజలు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆసుపాక గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఆసుపాక పోస్ట్‌మాష్టర్ అయిన శశాంక్ గత ఏడాది 2024 నుండి గ్రామస్థులకు వచ్చినటువంటి ఎటువంటి లెటర్స్ గాని, ఆధార్‌లు గాని డెలీవరీ చేయకుండా తనవద్దే కుప్పలుగా ఉంచుకున్నాడని అన్నారు. ఈ విషయంపై శశాంక్‌ని ప్రశ్నించగా చాలా దురుసుగా సమాధానాలు చెబుతున్నారని కావున అతనిచర్యపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పిర్యాదు చేశారు.

## ఖాళీ కడుపుతో టీ తాగుతున్నారా ?



ఉదయాన్నే ఖాళీ కడుపుతో టీ తాగేవారికి ఎసిడిటీ వచ్చే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంకా మీ జీర్ణాశయంలో యాసిడ్, అల్కలీన్ బ్యాలెన్స్ దెబ్బతింటుంది. ఇతర పోషకాలను శోషించుకోవడాన్ని టీ నిరోధిస్తుంది. మీ మెటబాలిక్ సిస్టమ్, జీర్ణక్రియపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అల్సర్, స్కెలెటల్ ఫ్లోరోసిస్ అనే వ్యాధి బారిన పడతారు. అందుకే ఖాళీ కడుపుతో టీ తాగకండి. ఉదయం టిఫిన్ చేసిన గంట తర్వాత టీ తాగొచ్చు.

# ఓట్ల కోసం అంబేద్కర్ జపం !

దళిత జనోద్ధరణలో అన్ని పార్టీలది ఒకటే విధానంగా ఉంది. నేటికీ దళితుల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు లేవు. వారిని ఓటుబ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప తమలో ఒకరిగా చూడడం లేదు. దీనికితోడు దళితుల్లో ఉపకులాల ద్వారా వారి ఐక్యతను దెబ్బతీస్తున్నారు. అలాగే మాల, మాదిగ అంటూ దళితులే రోడ్డెక్కేలా చేస్తున్నారు. దీని ఆధారంగా ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నాల్లో ఉన్న ఆయా పార్టీల పన్నాగాలను దళితులు గుర్తించడం లేదు. ఏటా అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన విగ్రహాలకు దండలేయడం...కొత్తగా విగ్రహాలు పెట్టడం వరకే ప్రభుత్వాలు బాధ్యత వహిస్తున్నాయి. భారీ విగ్రహాలను పెట్టి దళితజనోద్ధరణ అంటూ కాలం గడిపేస్తున్నారు. నేతలు కూడా అంబేద్కర్ విగ్రహాలను పెట్టాలన్న డిమాండ్ తీసుకుని వచ్చి వారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ రకంగా వారిని ఎప్పటికప్పుడు మోసం చేస్తున్నారు. స్వాతంత్ర్యానంతరం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకుం టున్నారే తప్ప వారిని తోటి మానవులుగా రాజకీయ నాయకులు భావించడం లేదు. వారికి సమాజంలో గౌరవం దక్కేలా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం లేదు. గ్రామాల్లో ప్రజలమధ్య వైషమ్యాలు లేకున్నా నాయకుల ఆలోచనలో అవి ఉన్నాయనడానికి మన నాయకుల తీరే నిదర్శనం. అంబేద్కర్ ఆశయాలను పాటించడం.. ఆయన ప్రవచించిన సిద్ధాంతాలను అమలు చేయడం అన్నది పైకి కనిపిస్తున్న ముసుగు మాత్రమే. ఏడున్నర దశాబ్దాల స్వాతంత్ర్య కాలంలో మన నాయకులంతా సమాజాన్ని విచ్ఛిన్నం చేసే దిశగా కులాల కుంపట్లు రగిలిస్తున్నారు.ఇప్పుడు రాజకీయ పార్టీలకు, నాయకులకు ఆయన పేరును జపించడం నిత్యకృత్యం కావడం వెనక ఓటుబ్యాంక్ రాజకీయం తప్ప మరోటి లేదు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందాన అంబేద్కర్ పేరు చెప్పుకుని అణగారిన వర్గాలను బుట్టలో వేసుకోవడం అన్న కళలో మన నాయకులు ఆరితేరారు. ఆయనకు భారీ విగ్రహాలు పెట్టి దండలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆయన ఆశయాలను తుంగలో తొక్కామన్న భావన రాకుండా నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్నారు. ఎంతో జాగ్రత్తగా అన్ని రాజకీయ పార్టీలు అణగారిన వర్గాల ఓట్లకోసం అంబేద్కర్ పేరును వాడుకుంటున్నారు. ప్రతి ఎన్నికల్లో అది



బాగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ అయితే అంబేద్కర్ పేరు ఉచ్చరించకుండా ఉండలేకపోతున్నారు. ఆయనకు మేమిచ్చిన గౌరవం మరెవరూ ఇవ్వలేదంటున్నారు. కానీ ఈనాడు నిత్యం అంబేద్కర్ జపం చేస్తున్న వారంతా ఉన్నత కులాలు వారే. వారు ఏనాడు దళితులను ఉన్నతికి తీసకుని వచ్చేందుకు ప్రయత్నించడం లేదు. రాష్ట్రపతిని చేయడం దళిత ఉద్ధరణ అనుకుంటారు. పాలనా పగ్గాలు వారి చేతుల్లో లేకుండా ఉత్సవ విగ్రహాలుగానే వారిని చూస్తున్నారు. దేశంలో పరిస్థితులు చూస్తుంటే అంబేద్కర్, పూలేలు ఎదుర్కొన్న వర్ణవివక్ష, కులవివక్ష జాడ్యాలు ఇంకా సమిసి పోయాయని చెప్పగలమా ? అంటే చెప్పలేం. ఇంతగా విద్య అందుబాటులోకి వచ్చినా ఇంకా వారు అణగారిన వర్గాలు గానే మిగిలిపోతున్నారు. ఒకటి రెండు పదవులు వారి మోహాన పడేసి దళితజన ఉద్దరణ జరిగిందన్న ప్రచారం చేసుకుంటే మనల్ని మనం మోసం చేసుకోవడమే అవుతుంది. దళితబందు, పెన్షన్లు వంటివి ఇచ్చి ఆహా..ఓహో అంటూ కాలం గడుపుతున్నారు. దళిత ఉద్ధరణ గురించి గొప్పగా చెప్పుకునే కాంగ్రెస్ జగ్జీవన్ రామ్‌కు ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చినా అడ్డుకున్న చరిత్రను మరచిపోలేం.. అందుకే దళితనేతను పాలనకు దగ్గరగా చేసిన చరిత్రను చూడడం లేదు. దళితులను సిఎం చేస్తానన్న కెసిఆర్ సైతం వారిని ఓటుబ్యాంక్ కోసం మభ్యపెట్టారు. తొలి దళిత ముఖ్యమంత్రి అంటూ ఊదరగొట్టి తెలంగాణ సమాజాన్ని మోసం చేసి, పదేళ్ల పాటు ఆయనే సిఎంగా కొనసాగారు. దళితబంధు పేరుతో అక్రమాలకు తెరతీసారు. నిజంగానే మనం అంబేద్కర్ మహానుభావుడి ఆశయాలను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నామా లేదా అన్నది నేతలతో పాటు దళితులు కూడా ఆలోచన చేయాలి. ఎన్ని దళిత వాడలను పురుద్ధరించారో.. ఎందరికి చదువు, ఉద్యోగాలు కల్పించారో ఆత్మవిమర్శ చేసుకోవాలి. అంబేద్కర్ ఆశించిన ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లడంలో రాజకీయ పార్టీలు చేస్తున్న మోసాలు గుర్తించాలి. దళితులంతా ఒక్కటే అన్న పట్టుదలతో సాగితే రాజకీయాల్లో పట్టు సాధించగలమని దళితులు గుర్తించాలి. అంతరాలు లేని సమాజం నిర్మించేందుకు ప్రయత్నించిన దాఖలాలు లేవు. రాజకీయ నాయకులే కులాల కుంపట్లు సృష్టించి దేశంలో అసమానతలను పెంచి పోషిస్తున్నారు. దీంతో కులవ్యవస్థ మరింత బలంగా వేళ్లూనుకుని సమాజాన్ని అతలాకుతలం చేస్తోంది. రాజకీయ నాయకులు ఎలాగూ మంచి చేయరు. కనీసం ప్రజలుగా మనమంతా ఆ మహనీయుడికి నివాళి అర్పించేందుకు ఆయన చూపిన మార్గంలో నడిచే ప్రయత్నం చేయాలి.అంటరాని కులాలు ఆర్థికంగా బలపడనిదే, రాజకీయాధికారం పొందనిదే వారి సమస్యకు సమగ్రమైన పరిష్కారం దొరకదని అంబేద్కర్ ఆనాడే ప్రకటించారు. వారికి రాజ్యాధికారం వస్తే తప్ప ఈ అంటరానితనం, చిన్నచూపు చూడడం వేరుగా చూడడం వంటి సమస్యలు సమిసిపోతాయని భావించాడు. భారత జాతీయ కాంగ్రెస్ నడిపే జాతీయోద్యమంలో అంటరానితన నిర్మూలన కోసం గాంధీ కృషి చేస్తూ ఉంటే ఆ కృషికి కాంగ్రెస్ సభ్యులనుండి పూర్తిస్థాయిలో మద్దతు లభించనేలేదు. గాంధీజి వర్ణ వ్యవస్థను భారత సమాజం ప్రత్యేక లక్షణమని, ఎవరి కుల వృత్తిని వారు అనుసరించడం వల్ల ఎటువంటి పోటీలేని ఆర్థిక వ్యవస్థ భారత సమాజంలో ఉన్నదని సమర్థించాడు. ఆనాడే అంబేద్కర్‌ను ప్రధాని చేయాలన్న ఆలోచనకూడా గాంధీజీకి రాలేదు. ఇప్పటికైనా దళితులు ఐక్యత ప్రదర్శించాలి. అంబేద్కర్ పేరుతో చేసే రాజకీయాలను దునుమాడాలి. ఎన్నికల్లో ఐక్యత చాటాలి. తమను రాజకీయంగా వాడుకుంటున్న నేతల నిజస్వారూపాలను గుర్తించాలి. అప్పుడే అంబేద్కర్ మహాశయుడి ఆశయాలను సాధించగలం.

## పౌల్ట్రీ పరిశ్రమలో నష్టాలే ఎక్కువ

- ధరలు పెరుగుతున్నా నష్టాలే అధికం
- పరిశ్రమల యజమానుల ఆవేదన



**విజయవాడ:**కరోనా దెబ్బతో తొలినాళ్లలో పౌల్ట్రీ పరిశ్రమ విలవిల్లాడుతోంది. చికెన్ అమ్మకాలు తగ్గాయి. పలు ప్రాంతాల్లో అయితే ఏకంగా కోళ్లను బొందపెట్టారు. అమ్ముకోలేక, కోళ్లను సాకలేక రైతులు నానాయాతన పడ్డారు. చికెన్ కిలో ధర 50కి పడిపోయింది. కానీ ఇప్పుడు మళ్లీ ధరలు పెరిగాయి. కిలో 300కుచేరువలోకి వచ్చింది. దీనికితోడు ఎండాకాలం కావడంతో మరింతగా ధరలుపెరిగే అవకాశం ఉంది. అయినా నష్టాలు తప్పడం లేదని పౌల్ట్రీరైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లలో కరోనా దెబ్బకు అన్ని రంగాల్లో మాంద్యం నెలకొంది. మార్కెట్లు కుప్పకూలాయి. బంగారం ధరలు అందుకోలేనంతగా పెరుగుతున్నాయి. ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నవారికి ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు ఇస్తూ వస్తోంది. కానీ ధరలతో దెబ్బతింటున్న సామాన్యులకు మాత్రం ఊరట దక్కడం లేదు. రాష్ట్రంలో పౌల్ట్రీరంగం దాదాపు 25 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నది. కోళ్లు, గుడ్లు మంచి ప్రొటీన్ అని, ఎలాంటి అనుమానాలు లేకుండా తినాలని.. వస్తున్నప్రచారం నేపథ్యంలో ఇప్పుఊడిప్పుడే పౌల్ట్రీ పరిశ్రమ మళ్లీ పుంఉకుంటోంది. కరోనా కారణంగా పౌల్ట్రీ రంగం కుదలేయ్యింది. మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. అన్నిరంగాలను దెబ్బేసింది. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే వైరసతో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో కరోనా కారణంగా పరిస్థితి ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది. దీనిపై ఆధారపడ్డ అనేక అనుబంధ పరిశ్రమలూ దెబ్బతింటాయి. దీని నుంచి గట్టెక్కకపోతే ఈ రంగంపై ఆదారపడి జీవిస్తున్న లక్షలాదిమందికి ఉపాధి దెబ్బతినే ప్రమాదం ఉంది.

# రైతులను ఆదుకోలేని బీమా పథకాలు

ఎన్నికల్లో హామీలు ఇవ్వడం..గెలిచిన తరవాత నాలుక మడతేయడం నాయకులకు అలవాటుగా మారింది. రైతుల ఆదాయం రెండింతలు చేస్తామన్న మోడీ హామీ పదేళ్లయినా నెరవేరలేదు. నిజానికి దేశంలో పుష్కలంగా నీటివనరులు, సారవంతమైన భూములు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకునే ఇంజనీరింగ్ నైణ్యాలను పాలకులు ప్రదర్శించడం లేదు. నదీజలాలు సముద్రం పాలుకాకుండా...ఏటా వరదలతో అతలాకుతలం కాకుండా...ఆనకట్టలు కట్టాలన్న స్పృహలేకుండా పోతోంది. డబ్బుల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు పనికిరాకుండా పోతున్నాయి. నదుల అనుసంధానం అన్న మాటే మోడీ ఎత్తడం లేదు. దేశంలో అన్నిరకాల పంటలకు అనువైన నేలలు ఉన్నా, సమగ్ర పంటల విధానం రావడం లేదు. దీంతో రైతులకు పంటలను పండించడం ఎంత కష్టంగా మారిందో..అమ్ముకోవడం అంతకుమించిన భారంగా మారుతోంది. పంటల కొనుగోళ్లు,బీమాల విషయంలో ప్రభుత్వాలు స్పష్టమైన జాతీయ విధానాల ను అవలంబించడం లేదు. దీంతో పంటలు చేతికి వచ్చినప్పుడు ధరలు లేక పోవడం..పంటలు నష్టపోయి నప్పుడు బీమా సొమ్ము అందక పోవడం షరామామూలుగా మారింది. ప్రధానంగా వాణిజ్యపంటల విషయంలో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనిని సవాల్‌గా తీసుకుని రైతులకు అండగా నిలవాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా సరైన బీమా విధానం లేదు. ఉన్నా రైతులకు అవగాహన లేదు. దీనిని జాతీయ విధానంగా తీసుకుని రవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా పంటలు నష్టపోతున్నరైతులకు సరైన బీమా సౌకర్యం అందడం లేదు. గ్రామాల వారీగా కాకుండా పంట వారీగా బీమా సౌకర్యం రావాల్సి ఉంది. వ్యవసాయం చుక్కాని లేని నావలా తయారవగా వాణిజ్య పంటల సాగు జూదాన్ని తలదన్నింది. మునుపటి ఏడాది మిర్చికి కాస్త రేటు పడటంతో ఖరీఫ్‌లో రైతులు అటు మళ్లారు. రికార్డు స్థాయిలో ఎపిలో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి అయింది. కౌలు రైతులకైతే లక్షన్నర. పెట్టుబడులు పూర్తిగా నష్టపోయిన రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో మిర్చికి తామర తెగులు పలు రాష్ట్రాల్లో వ్యాపించినందున జాతీయ విపత్తుగా ప్రకటించి సాయం చేయాల్సిన కేంద్రం చేతులెత్తేసింది. రాష్ట్రం కేంద్రాన్ని నిలదీయకుండా లేఖలతో సరిపెట్టింది. వీరిద్దరి మధ్య రైతులు సమిధలవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా మిర్చి రైతులను ఆదుకుందా అంటే అదీ లేదు. అధ్యయన కమిటీల పేరుతో కాలక్షేపం చేసింది. అలాగే గతంలో వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు స్వల్ప విస్తీర్ణానికి పదో



పరకో ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఎంత మందికి ఎంత మొత్తంలో ఎప్పటికి ఇన్సూరెన్స్ వస్తుందో పెద్ద పజిల్‌గామారింది. ఒక వైపు అంతుబట్టని తెగుళ్లు, వైరస్‌లు ఇంకో వైపు నకిలీ, కల్తీ విత్తనాల కారణంగా విపరీతంగా నష్ట పోతున్నారు. వీటిని తట్టుకోలేని రైతులు ఉసురు తీసుకుంటున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆదుకోవడానికి సమగ్ర పంటల బీమా ఉండాల్సిందే. రైతులు ఏ రకంగా పంటలు నష్టపోయినా అండగా ఉండేలా బీమా సౌకర్యం రావాల్సి ఉంది.పట్టెడన్నం పెట్టే రైతులు తమకు చిన్నబాధ వచ్చినా తట్టుకోలేని దైన్య స్థితిలో ఉన్నారు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో పత్తి,మిర్చి పంటలతో పాటు,పసుపు రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రధానంగా మిర్చి రైతులు తెగుళ్ల కారణంగా లక్షలాది రూపాయాల నష్టాన్ని మూటగట్టుకున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో సాగయ్యే రెండు ప్రధాన వాణిజ్య పంటలు మిరప, పత్తి రైతాంగం ఆసాంతం పెట్టిన పెట్టుబడులు కోల్పోయి ప్రభుత్వ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మిర్చికి ఇటీవల రికార్డు ధరలు పెరిగాయి. కానీ ధరలు పలికిన సమయానికి మిర్చి బాగా దెబ్బతింటోంది. ఎపిలో ఎప్పటి నష్టాలకు అప్పుడే పరిహారం అంటున్న సర్కారు మిర్చి, పత్తి విషయంలో నాన్చుడు దారి పట్టి రైతులను క్షోభకు గురి చేస్తోంది. తామర తెగులు సోకి మిర్చి, నకిలీ విత్తనాల వలన పత్తికి నష్టం వాటిల్లగా, ఈ నష్టాలకు ప్రభుత్వ పూచీ ఏమిటో ఇప్పటికైతే స్పష్టత లేదు. వివిధ కారణాలతో పంట నష్ట పోయిన రైతులకు తక్షణం పరిహారం అందించి ఆసరా కల్పించాల్సిన సర్కారే సాకులు చెప్పి పరిహాసం ఆడటం అమానవీయం. పరిహారంపై రైతులకు కనీసం భరోసా సైతం కల్పించకపోవడం అన్యాయం. ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన మిర్చి, పత్తి రైతులు రోడ్డెక్కుతున్నారు. పత్తి రైతుల గోడు చెప్పనలవి కాదు. నకిలీ, కల్తీ, నాసిరకం విత్తనాల వలన పంట నష్టపో యిన రైతులకు కంపెనీల నుండి పరిహారం ఇప్పించేందుకు 2011లో ప్రభుత్వం ఇచ్చిన జీవో పైనా ఇలాగే కంపెనీలు కోర్టుకెళ్లాయి. ఇక్కడా ప్రభుత్వ స్పందన లేదు. దాంతో ప్రభుత్వం కంపెనీలకు అనుకూలంగా ఉందనే భావన కలుగుతోంది. గతంలోనూ నకిలీ మిర్చి నారు, మిర్చి విత్తనాలతో రైతులు నష్టపోయారు. ఇంతా జరుగుతున్నా ఆర్‌బికెలు, గ్రామ సచివాలయాలు, ఇంటెలిజెన్స్, పోలీస్, వ్యవసాయ శాఖలు ఏం చేస్తున్నాయో తెలీదు. నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. నష్టపోయిన మిర్చి, పత్తి రైతులను సత్వరం ఆదుకోవాలి. వారికి జాతీయస్థాయిలో పంటల బీమాను తీసుకుని రావాలి. అప్పుడే వారికి న్యాయం జరుగుతుంది. ఈ వైపుగా ఆలోచనలు చేసి సమగ్ర పంటల బీమా అమల్లోకి తీసుకుని రావాల్సి ఉంది. అలాగే నకిలీ విత్తనాలు అంటగట్టే వ్యాపారులపై కఠిన చర్యలకు అవకాశం ఉండాలి.

## దేశ సమస్యలపై స్పష్టమైన హామీ ఏదీ ?

దేశంలో మళ్లీ తమదే అధికారం అని బిజెపి ఘంటాపథంగా చెబుతోంది. ఎన్‌డిఎ 400 సీట్లు సాధిస్తుందన్న ధీమాలో ఉంది. కాంగ్రెస్ తమకు పోటీ కాదని, ఇండియా కూటమికి ప్రజల అండలేదని ప్రచారం చేసు కుంటోంది. ఈ క్రమంలో బిజెపి పదేళ్ల పాలనను గీటురాయిగా తీసుకుంటే..అనేక విషయాలు చర్చించాల్సి ఉంటుంది. ప్రధానంగా పెట్రో, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. జిఎస్టీ పేరుతో ప్రజల నడ్డి విరుస్తు న్నారు. నోట్ల రద్దు కారణంగా సామాన్యులు పడ్డ ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. నిరుద్యోగం చెప్పడానికి లేదు. ఉద్యోగాల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు అసలు లేకుండా పోయాయి. యువత సర్టిఫికెట్లు పట్టుకుని విదేశాలకు చెక్కేస్తున్నారు. ఈ దేశంలో బతకలేమని కూలీలు గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు. రైతులకు మద్దతు ధరలు దక్కడం లేదు. బియ్యం ధరలు అమాంతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు మొదలు నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. గృహసంబంధ సిమెంట్, ఇసుక, ఇనుము తదితర వస్తువుల ధరలు విపరీతంగా పెంచేస్తున్నారు. సామాన్యులు ఇల్లు కొనుక్కుని బతికే అవకాశం లేకుండా చేశారు. కేవలం ప్రభుత్వం కట్టించే ఇళ్లపై ఆధారపడేలా చేస్తున్నారు. ఇదంతా కూడా అభివృద్ధికి చిహ్నమా అన్నది చర్చించాలి. ప్రధాని మోడీ చెబుతున్న వికసిత్ భారత్‌కు ఇదంతా నిదర్శనంగా చూడాలి. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. అమ్మాయిలు చదువుకునే పరిస్థితి లేదు. కనీసం బాలికా విద్యకు అవసరమైన రుణాలకు కూడా వెసలుబాటు లేదు. ఈ క్రమంలో బిజెపి ప్రకటించిన మేనిఫెస్టోలో ఈ అంశాలేవీ చర్చించలేదు. సరికదా స్పృశించలేదు. దేశంలో రైతులు కీలకమైన ఓటు బ్యాంకుగా ఉన్నారు. దీంతో ఈ వర్గాన్ని ఆకట్టుకునేందుకు రెండు పార్టీలు ప్రయత్నించాయి. వ్యవసాయాన్ని సాంకేతికతను జోడించడంతో పాటు.. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను బలోపేతం చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కనీస మద్దతు ధరపెంచుతామని తెలిపింది. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. వ్యవసాయ ఫైనాన్స్‌పై శాశ్వత కమిషన్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చింది. నిజానికి వ్యవసాయ రంగం అతిపెద్ద పరిశ్రమగా పాలకులు గుర్తించడం లేదు. దీనిని గుర్తించి అనుబంధ పరిశ్రమలు చేపడితే దేశంలో సగం నిరుద్యోగం పోతుంది. అలాగే దేశీయంగా పంటలకు ప్రాధాన్యం పెరుగుతుంది. కానీ రెండు పార్టీలు ఈ రంగంపై పెద్దగా విశ్లేషణ చేయడం లేదు. మహిళా సాధికారత సాధించే దిశగా గ్రామీణ మహిళలను లక్షాదికారులు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. అలాగే మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామని బీజేపీ మేనిఫెస్టోలో తెలిపింది.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేదింటి మహిళకు షరతులు లేకుండా ఏడాదికి లక్ష రూపాయిలు నేరుగా ఖాతాల్లో జమచేస్తామని తెలిపింది. 2025 నుంచి మహిళలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50శాతం రిజర్వేషన్లు. ప్రతి జిల్లాలో కనీసం ఒక సావిత్రీబాయి పూలే హాస్టల్‌తో వర్కింగ్ ఉమెన్ హాస్టళ్ల సంఖ్యను రెట్టింపు చేస్తామని తెలిపింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ కోసం రూ. 25 లక్షల వరకు నగదు రహిత ఆరోగ్య సేవలు పొందే విధంగా బీమా పథకం అమలు, పబ్లిక్ హెల్త్ సెంటర్లలో అన్ని పరీక్షలు, మందులు ఉచితంగా అందిస్తామిన కాంగ్రెస్ తెలిపింది. . ఇలాగే వెళితే దేశంలో సామాన్యులు, పేదలు, మధ్యతరగతి వాళ్లు బతకడం కష్టం కాగలదు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదు. పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారేలా ప్రభుత్వ విధానాలు ఉంటున్నాయి. దేశంలో సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఈనెల 19న తొలివిడత పోలింగ్ జరగనుంది. ఏడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. గెలుపు కోసం రాజకీయ పార్టీలు వ్యూహాలను సిద్ధం చేశాయి. ముందు ప్రజలను ఆకర్షించేందుకు మేనిఫెస్టోలతో అన్ని పార్టీలు సిద్దం అయ్యాయి. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీలు తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. తమను గెలిపిస్తే ఏం చేస్తామో ప్రజలకు వివరిస్తున్నారు. కాంగ్రెస్ 'న్యాయ్ పత్ర్ ' పేరుతో బీజేపీ 'సంకల్ప్ పత్ర్' పేరుతో ఎన్నికల ప్రణాళికను విడుదల చేశాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు, కాంగ్రెస్, బీజేపీ తమ తమ మేనిఫెస్టోలను విడుదల చేశాయి. మోదీ గ్యారెంటీ క్యాప్షన్‌తో బీజేపీ సంకల్ప్ పత్ర్ విడుదల చేయగా.. మహిళలు, యువత, నిరుపేదలు, రైతులు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ న్యాయ పత్ర్‌ను రూపొందించింది. ఓ రకంగా చెప్పాలంటే రెండు పార్టీలు యువతను ఆకర్షించే ప్రయత్నం చేశాయి. ఎందుకంటే యువ ఓటర్ల సంఖ్య దేశంలో గణనీయంగా పెరిగింది. బీజేపీ తన మేనిఫెస్టోలో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా చట్టాలు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను సత్వరమే భర్తీ చేశామని, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపింది. కానీ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగాల కల్పన అన్నది లేకుండా పోయింది. ప్రచారాడంబరం తప్ప ఉద్యోగాలు లేక యువత రోడ్డున పడుతోంది. ఉన్నత చదువులు చదివినా కొలువులు కానరావడం లేదు. దేశాన్ని గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చి ఉపాధి అవకాశాలు పెంచుతామని బిజెపి మరోమారు యువతను మోసం చేసే ప్రయత్నం చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా ముద్ర రుణాల పరిమితిని పెంచుతామని కూడా పేర్కొంది. కానీ ప్రభుత్వ ఉద్యోగాల కల్పనపై స్పష్టమైన హామీని ప్రకటించలేదు. అయితే ఇందుకు భిన్నంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి యువ న్యాయ్ కార్యక్రమం అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలిపింది. డిప్లొమా, గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 25 ఏళ్లలోపు యువకుల కోసం రైట్ టు అప్రెంటీస్‌షిప్ చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో 30 లక్షల ఖాళీలను భర్తీ చేస్తామిన తెలిపింది. అధికారంలో ఉన్న బిజెపి మాత్రం ప్రభుత్వ ఖాళీల భర్తీకి ముందుకు రాలేదు. ఇకపోతే సీనియర్ సిటిజన్ల కోసం రెండు పార్టీలు తమ మేనిఫెస్టోలో వివిధ హామీలు ఇచ్చాయి. 70 ఏళ్లు పైబడిన వారికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్య సేవలు అందిస్తామని తెలిపింది. తీర్థయాత్రలు చేపట్టే సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపింది. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను కఠినంగా అమలు చేస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులకు జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం కింద పెన్షన్‌ను వెయ్యి రూపాయిలకు పెంచుతామని చెప్పింది. సీనియర్ సిటిజన్లకు ప్రజా రవాణాలో ప్రయాణ రాయితీలను పునరుద్దరిస్తామని కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో పేర్కొంది. రెండు పార్టీలు అన్నివర్గాలను ఆకట్టుకునే విధంగా తమ మేనిఫెస్టోలో పథకాలను పొందుపర్చాయి. కానీ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ది ఈ రెండు పార్టీలకు లేదని గతంలో వీరి పాలనా కాలం తీరు చూస్తే అర్థం చేసుకోవచ్చు

# ప్రజల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

### - ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టని విపక్షం - మోడీ వికసిత భారత్ పేరుతో డంబాచారం

**న్యూఢిల్లీ:** వికసిత భారత్ పేరుతో ప్రకటనలు మార్మోగుతున్నాయి. ప్రజలకు ఎలా మేలు చేశారో మోడీ గ్యారెంటీలతో ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ సామాన్యులకు మాత్రం ఏం మేలు జరిగిందో చెప్పడం లేదు. ఉచిత రేషన్ అంటున్నారు. కోట్లాది ఇళ్లు కట్టామని అంటున్నారు. ఇన్ని చేసినా ప్రజల జీవితాలు మాత్రం మారలేదు. కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ఆర్థిక విధానాలు సామాన్యులకు గుదిబండగా మారుతున్నాయి. వారి ఆర్థిక జీవనచిత్రం ఛిద్రం అవుతోంది. తాజాగా కేంద్ర ఆర్థికశాఖ తీసుకున్న నిర్ణయం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఈ విషయాలపై పార్లమెంటులో ఎక్కడా చర్చించడం లేదు. రాజకీయంగా తమకు లబ్ది చేకూర్చే విషయాలపై మాత్రమే విపక్షాలు గొంతెత్తుతున్నాయి. అందుకోసం పార్లమెంట్ సమావేశాలను స్తంభింప చేస్తున్నాయి. నిజానికి అంతకు మించిన సంక్షోభం ఇప్పుడు ప్రజలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా పాన్ నంబర్‌తో ఆధార్ లింక్ చేయడం...వచ్చే ఆర్థిక సంవత్సరం జీవితబీమా మొత్తంపై టాక్స్ విధిస్తూ తీసుకున్న నిర్ణయాలు పేద,మధ్య తరగతి ప్రజలపై పెనుభారంగా మారబోతోంది. ఈ దొంగ దోపిడీ నిర్ణయాలను విపక్షాలు కనీసం గమనించినట్లుగా కూడా లేదు. ఇప్పటికే పాన్‌తో ఆధార్ లింక్ అయివుంటే ఫర్వాలేదు.. కానీ లింక్ చేయాల్సిందే. దీనికి కూడా ఐటి విభాగం ఒక్కో వ్యక్తికి వేయ రూపాయలు వసూలు చేస్తోంది. ఇక నెట్ సెంటర్లలోకి వెళ్లి లింక్ చేసుకోవాలంటే అదనంగా మరో 200 రూపాయలు కట్టాల్సి వస్తోంది. ఇది సామాన్యులపై ఎంతగా భారం పడుతుందో కేంద్ర పాలకులు గమనించడం లేదు. ప్రతి పనికీ ఆధార్, పాన్ అవసరం కావడంతో ప్రజలు తప్పనిసరిగా లింక్ చేసుకుం టున్నారు. ఇదికూడా కేంద్రానికి ఆదాయ వనరుగా మారింది. ఇలా లింక్ చేయడం వల్ల కేంద్రానికి కనీసంగా ఓ 40,50వేల కోట్ల ఆదాయం సమకూర బోతోంది. అలాగే లింక్ చేయకుంటే 50వేలకు పైగా లావాదేవీలపై పదివేల వరకు పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. ఇది ప్రజల్లోకి పెద్దగా వెళ్లడంలేదు. దీనిని వెంటనే ప్రజలు గమనించి ముందుకు వెళితే మంచిది. ఇకపోతే ప్రజలు పైసాపైసా పొదుపు చేసుకుని కట్టే జీవితబీమా పాలసీపైనా ఇప్పటికే జిఎస్టీ వసూలు చేస్తున్నారు. హెల్త్ పాలసీలపైనా జిఎస్టీ పేరుతో దండుకుంటున్నారు. గత ఏప్రిల్ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఎవరైనా కూడా కొత్తగా జీవితబీమా చేయదల్చుకుంటే... పాలసీ మెచ్యూరిటీ అయిన తరవాత వచ్చే రాబడిపైనా పన్ను విధించబోతున్నారు. ఇది కనీసం 6శాతంగా ఉండబోతోంది. మోడీ ప్రభుత్వం ఇలా ప్రజలను వేపుకుతింటున్న తీరును ప్రజలు గమనించాలి. ఇప్పటికే గ్యాస్ సిలిండర్ ధరలు మోత మోగిస్తున్నాయి. అయితే తెలివిగా ఎన్నికల ముందు వంద రూపాయలు తగ్గించారు. పెట్రోధరలు మంటపెడుతున్నాయి. పెద్దనోట్ల రద్దు మొదలు జీఎస్‌టీ వరకు ప్రజల జీవితాలను మోడీ ఆర్థిక విధానాలు అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఢిల్లీలో కూర్చుని తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా సామాన్యులు అతలాకుతలం అవుతున్నారు. అచ్ఛేదిన్‌కు నిర్వచం లేకుండా పోయింది. కేవలం కొందరి స్వార్థం కోసం, కొందరి ప్రయోజనాల కోసం 90శాతం భారతీయులు ఇబ్బందులు పడాల్సిన దుర్భర పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. అయినా తమేదో ఘనకార్యం చేస్తున్నట్లుగా బిజెపి పాలకులు బాకాలు ఊదుతు న్నారు. కాంగ్రెస్ కూడా ఇలాంటి సమస్యలపై ఫోకస్ చేయడం లేదు. వారు కూడా ఓట్ల కోసం నగదు బదిలీ పథకాలనే నమ్ముకున్నారు. మహిళలకు ఏటా లక్ష వరకు ఖాతాల్లో వేస్తామని ప్రకటించారు. ఇప్పటికే జీఎస్టీ భయాలు వెన్నాడు తున్నా వాటిని సవరించి ఆదుకుంటామన్న ఒక్కమాట కూడా ప్రభుత్వం నుంచి రావడం లేదు. దీంతో ప్రజలకు ఈ ప్రభుత్వం భరోసగా లేదన్న విషయం అర్థం అవుతోంది. విపక్షాలు కూడా సమస్యలను చర్చించడానికి పార్లమెంట్‌లో అవకాశాలు వచ్చినా వదులుకుని, గొడవలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సమస్యను సమస్యగా చర్చించడంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు పూర్తిగా విఫలమయ్యారు. పార్లమెంటులో సమస్యలను ప్రస్తావించడం కన్నా గొడవ చేసి వాయిదా వేయించడంలోనే గత పదదేళ్ల కాలం గడిపారు.



## రెండోమారు తెలంగాణ ఆడపడుచుగా?

'మహానటి' సావిత్రిగా శిఖర సమానమైన అభినయాన్ని ప్రదర్శించిన కీర్తిసురేష్.. 'సర్కారువారి పాట'లో కళావతిగా యువతరం కంటికి కునుకు లేకుండా చేశారు. నటిగా ఈ పొంతన లేని కోణాలు ఆమెను నిజంగానే మహానటిని చేశాయి. ప్రస్తుతం అటు సినిమాలు, ఇటు వెబ్ సిరీస్‌లు అంటూ క్షణం తీరిక లేకుండా కెరీర్ సాగిస్తున్నారు కీర్తి సురేశ్. చెన్నయ్ టూ ముంబై వయా హైదరాబాద్.. ఇది ప్రస్తుతం కీర్తి సురేశ్ పరిస్థితి. 'అక్క' అనే వెబ్ సిరీస్‌తో పాటు, తమిళంలో 'రివాల్వర్ రీటా' అనే సినిమా కూడా చేస్తున్నారు. ఇక తెలుగులో 'బలగం'ఫేం వేణు యల్దెండి దర్శకత్వంలో రూపొందనున్న 'ఎల్లమ్మ'లో టైటిల్ రోల్ కీర్తి సురేషే అని ఫిల్మ్ సర్కిల్స్‌లో వార్త బలంగా వినిపిస్తున్నది. ఇప్పటికే 'దసరా' సినిమాలో తెలంగాణ మహిళగా అద్భుతంగా నటించారు కీర్తి. ఇప్పుడు 'ఎల్లమ్మ'గా ఆమె ఖరారైన మాట నిజమైతే.. రెండోసారి తెలంగాణ పడుచుగా కనిపిస్తారన్నమాట. వేణు యల్దెండి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం తెలంగాణ సంస్కృతి, నమ్మకాల నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. వచ్చే నెలలోనే ఈ సినిమా షూటింగ్ మొదలుకానున్నదట.

# పవన్ సినిమాను ఆపే దమ్ము ఎవరికీ లేదు

**ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే , బంద్ వార్త మిస్‌కమ్యూనికేట్ అయింది**

**మీడియాతో నిర్మాత దిల్‌రాజు**



అగ్ర హీరో, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమకు పెద్దన్నలాంటివాడని, ఆయన తిడితే పడతామని, పవన్ హర్ట్ అయ్యారు కాబట్టి తిట్టే అధికారం ఆయనకుందని అన్నారు ప్రముఖ నిర్మాత దిల్ రాజు. తెలుగు సినీరంగానికి, ఏపీ ప్రభుత్వానికి మధ్య చోటుచేసుకున్న తాజా వివాదం నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో దిల్‌రాజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఇండస్ట్రీకి చెందిన వారెవరూ ఇప్పటివరకు ఏపీ ముఖ్యమంత్రిని కలవలేదని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై దిల్‌రాజు పైవిధంగా స్పందించారు. ఇక్కడ (ఇండస్ట్రీలో) ఎవరి దారి వారిదేనని, ఏమైనా సమస్యలొస్తేనే ప్రభుత్వాన్ని, ఛాంబర్‌ను ఆశ్రయిస్తారని దిల్‌రాజు అన్నారు. 'తమ డిమాండ్‌లు నెరవేరకుంటేనే బంద్ చేస్తామని ఎగ్జిబిటర్లు చెప్పారు. అంతలోనే జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ అంటూ బ్రేకింగ్ న్యూస్ వచ్చాయి. ఆ వార్తలను ఎగ్జిబిటర్లు, ఛాంబర్ ఖండించలేదు. ఇండస్ట్రీలో ఎవరి దారి వారిదే. ఇండస్ట్రీలో ఉన్న అందరం కలిసి కదా మీడియాతో మాట్లాడాల్సింది. అంతా కలిసి మాట్లాడాలంటే మాకు భయం' అని దిల్‌రాజు చెప్పారు. ఇరవైఏళ్లుగా తాను పవన్‌కల్యాణ్‌ను చూస్తున్నానని, ఆయనకు ఆగ్రహం తెప్పించేలా పరిస్థితులు ఏర్పడ్డాయని, పవన్ చిత్రాన్ని ఉద్దేశ్యపూర్వకంగా టార్గెట్ చేశారంటూ దుష్ప్రచారం జరిగిందని, అయితే వాస్తవాలు వేరుగా ఉన్నాయన్నారు. 'థియేటర్స్ బంద్ అనే వార్త రాంగ్‌గా కమ్యూనికేట్ అయింది. తూర్పు గోదావరిలో మొదలైన సమస్యను తెలంగాణకు ఆపాదించారు. ఏప్రిల్ 19న తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు మీటింగ్ జరిపారు. పర్సంటేజీ విధానం బాగుంటుందని ఎగ్జిబిటర్లు కోరారు. డిస్ట్రిబ్యూటర్లు అంగీకారం చెప్పలేదు. సరిగ్గా అదే సమయంలో 'హరిహర వీరమల్లు' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఆ తర్వాత వాయిదా వేశారు. పర్సంటేజీల సమస్య ఈస్ట్ గోదావరిలో మొదలై తెలంగాణ దాకా వచ్చింది. ఈ అంశాన్ని ఇక్కడి ఎగ్జిబిటర్లు శిరీష్ దృష్టికి తీసుకొచ్చారు. మే 18న ఛాంబర్ మీటింగ్ జరిగింది. చివర్లో నేను అక్కడకు వెళ్లాను. జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తామని ఎగ్జిబిటర్లు చెబితే వద్దని వారించాను. అందరూ నాతో ఏకీభవించారు. పర్సంటేజీల విషయంలో ఎగ్జిబిటర్లు ఛాంబర్‌కు లేఖ రాశారు. వాళ్లు అనుకున్నది జరగకపోతే బంద్ చేస్తామన్నది ఆ లేఖ సారాంశం. కానీ బయట జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ అనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన నిర్మాతల మీటింగ్‌లో ఎగ్జిబిటర్లకు సమస్యలున్నాయని అందరూ చెప్పారు. జాయింట్ మీటింగ్‌లో స్పష్టతనిద్దామని అనుకునేలోగా 'హరిహరవీరమల్లు' సినిమాపై ఇష్యూ డైవర్ట్ అయింది. పవన్‌కల్యాణ్ సినిమాను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. ఒక్క కోవిడ్ సమయంలో తప్పితే థియేటర్ల బంద్ అనేది నా అనుభవంలో ఎప్పుడూ చూడలేదు' అని దిల్ రాజు పేర్కొన్నారు.

## యుద్ధం, జూదం ఒకటే!



సంగీత్ శోభన్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. జూన్ 6న విడుదలకానుంది. టీజర్‌ని సోమవారం విడుదల చేశారు. 'యుద్ధం, జూదం ఒక్కటే. యుద్ధం ఎక్కడ మొదలుపెట్టాలో తెలియాలి. జూదం ఎక్కడ ఆపాలో తెలియాలి.' అంటూ సాగే సంభాషణతో ఈ టీజర్ మొదలైంది. ఇందులో సంగీత్‌శోభన్ ఓ గ్యాంబ్లర్‌గా కనిపించబోతున్నారని టీజర్ చూస్తే అర్థమవుతున్నది. సినిమాలోని ముఖ్యపాత్రలన్నీ టీజర్‌లో పరిచయమయ్యాయి. మిస్టరీ ఎంటైర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాలనూ అలరిస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్ను, సాయిశ్వేత, జస్విక, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి.

### ప్రతీకార కథతో 'డెకాయిట్'

అడివి శేష్ హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ చిత్రం 'డెకాయిట్' గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ పాన్ ఇండియా చిత్రానికి షానియల్ డియో దర్శకుడు. మృణాల్ ఠాకూర్ కథానాయిక. నాయకానాయికలు అడవి శేష్, మృణాల్ ఠాకూర్ మధ్య భావోద్వేగభరిత సంభాషణతో మొదలైన గ్లింప్స్ ఆసక్తికరంగా సాగింది. 'నేను మోసగించడానికి రాలేదు. అంతకంటే ఎక్కువ చేస్తా' అంటూ మిస్టీరియస్ స్టైల్‌తో అడివి శేష్ చెప్పిన డైలాగ్ కథపై ఇంట్రెస్ట్‌ను పెంచింది. ఓ ఎపిసోడ్‌లో ఆయన ఖైదీ దుస్తుల్లో కనిపించారు.

# ఫైనల్ కట్ చూశాను.. అదిరిపోయింది



'ప్రేక్షకులకు అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా ఇది. ఒక మంచి సినిమాలో నటించామనే తృప్తి మా అందరిలో ఉంది. ఇష్టంతో కష్టపడి ఈ సినిమా చేశాం. దర్శకుడు విజయ్ కనకమేడల హార్డ్‌వర్క్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తుంది. రీసెంట్‌గా ఫైనల్ కట్ చూశాను. అదిరిపోయింది. మే 30 మనందరికీ పెద్ద పండుగ. సక్సెస్‌మీట్‌లో కలుద్దాం.' అని హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ అన్నారు. ఆయన, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా రూపొందిన మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడారు. అగ్ర నిర్మాత బెల్లంకొండ సురేష్, అగ్ర దర్శకులు సంపత్‌నంది, అనిల్ రావిపూడి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు.'ఈ సినిమా వల్ల సాయితో, రోహిత్‌తో నా బంధం బలపడింది. అలాగే ఆనంది, అదితిలతో కలిసి పనిచేయడం గొప్ప ఎక్స్‌పీరియన్స్. మేం సక్సెస్‌లో ఉన్నామా? సినిమాలు చేస్తున్నామా? ఈవేమీ చూడకుండా కేవలం మాపై నమ్మకంతో కె.కె.రాధామోహన్ ఈ సినిమా నిర్మించారు. విజయ్ కనకమేడల డెడికేషన్ ఉన్న డైరెక్టర్. ఈ సినిమా విజయం కోసం మేమంతా వేయికళ్లతో ఎదురుచూస్తున్నాం. సినిమా బాగా వచ్చింది. ఆదరిస్తారని నా నమ్మకం' అని మంచు మనోజ్ చెప్పారు. ఈ సినిమాతో దర్శకుడు విజయ్ కనకమేడల కచ్చితంగా కమర్షియల్ డైరెక్టర్ స్థాయికి ఎదుగుతాడని, ఈ సినిమా పెద్ద విజయం సాధించి, నిర్మాత రాధామోహన్‌కి లాభాలు తెచ్చిపెట్టాలని, తనకు జీవితాంతం మరిచిపోలేని జ్ఞాపకం ఈ సినిమా అని నారా రోహిత్ తెలిపారు.